ప్రభాత సూర్య
www.suryaa.news
ఎడిటర్ : నల్లవెల్లి కార్తీక్ కుమార్
తెలుగు జాతీయ దిన పత్రిక
వెల రూ.5/ - పేజీలు : 10 శనివారం 3 మే 2025 సంపుటి: 01, సంచిక : 01
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

## కాంగ్రెస్ నిర్లక్ష్యం ప్రజలకు శాపంగా మారింది: మాజీ మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్: భాజపా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను పూర్తిగా విస్మరించిందని మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు విమర్శించారు. జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన పలువురు భాజపా నేతలు, కార్యకర్తలు ఆయన సమక్షంలో భారాసలో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణకు భాజపా అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపైనా విమర్శలు గుప్పించారు. భారాస మొదలుపెట్టిన బసవేశ్వర, సంగమేశ్వర ప్రాజెక్టుల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా పక్కనపెట్టి జహీరాబాద్ నియోజకవర్గానికి అన్యాయం చేసిందన్నారు. ప్రాజెక్టులు పూర్తయితే జిల్లా మొత్తం సాగునీటితో సస్యశ్యామలం అవుతుందని పేర్కొన్నారు.

## గొంతెండిపోతోంది!

**హైదరాబాద్ :** రాష్ట్రంలో వేసవి ఎండలు మండిపోతుండటంతో తాగునీటి ఎద్దడి మొదలయ్యింది. వివిధ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు ఇప్పటికే 40 డిగ్రీలు దాటాయి. రాబోయే నెల రోజుల్లో వేసవి తీవ్రత పెరిగితే ఆ మేరకు తాగునీటి సమస్యలు కూడా మరింత పెరిగే అవకాశం ఉంది. మిషన్ భగీరథ కింద తాగునీటి సరఫరా జరుగుతున్న ప్రాంతాల్లో కూడా ప్రజలు మంచినీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు జిల్లాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. జలశయాలు, చెరువులు లేనిచోట్ల ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోర్ల ద్వారా భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకులకు మంచినీటిని సరఫరా చేస్తారు. అయితే జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడం, చాలాచోట్ల చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు ఎండిపోవడంతో ..

# తెలంగాణే మార్గదర్శి



- సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొన్న సీఎం రేవంత్
- కులగణన అంశంలో దేశానికే రాష్ట్రం ఆదర్శంగా నిలిచింది
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ స్పష్టీకరణ
- తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం కులగణన పూర్తి చేసిందన్న ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే... ప్రభుత్వ పథకాలకు వర్తింపజేసే ప్రక్రియ మొదలుపెట్టిందని వెల్లడి
- జాతీయ కులగణనలో తెలంగాణ విధానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ తీర్మానం
- మమ్మల్ని చూసే కేంద్రం ముందుకు వచ్చిందన్న సీఎం రేవంత్
- ఢిల్లీలో జరిగిన భేటీకి ఖర్గే, రాహుల్, ప్రియాంక తదితరుల హాజరు

**సూర్య, న్యూఢిల్లీ**

దేశంలో త్వరలో చేపట్టనున్న జనగణనలో కులగణనను చేర్చాలన్న కేంద్ర నిర్ణయం వెనుక కాంగ్రెస్ పార్టీ అద్వితీయ పోరాటం ఉందని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పేర్కొంది. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తన భారత్ జోడో పాదయాత్ర సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన చేసి చూపించిందని, దేశానికే మార్గదర్శిగా నిలిచిందని కొనియాడింది. తెలంగాణలో అన్ని వర్గాల నుంచి సమాచారం సేకరించి పారదర్శకంగా నిర్వహించిన కులగణన నమూనానే కేంద్రం అనుసరించాలని తీర్మానించింది. దేశంలోని అణగారిన వర్గాలకు విద్య, ఉపాధి, రాజకీయ అంశాల్లో న్యాయం చేసేలా జనగణనను ఎప్పట్లోగా పూర్తి చేస్తుందో కేంద్రం చెప్పాలని డిమాండ్ చేసింది. శుక్రవారం సాయంత్రం న్యూఢిల్లీ అక్బర్ రోడ్డులోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ భేటీ జరిగింది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు తెలుగు రాష్ట్రాల నుంచి కమిటీ సభ్యులు దామోదర రాజనరసింహ, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు హాజరయ్యారు. ప్రధానంగా - మిగతా2లో



ఉగ్రదాడిని ఎదుర్కొనేందుకు

## నిర్దిష్ట వ్యూహం ఏది?

- ఇంతవరకూ కేంద్రం వద్ద నిర్దిష్టమైన వ్యూహం ఏమీ కనిపించడం లేదు
- కులగణన చేపట్టాలని కాంగ్రెస్ చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించిది
- అయితే కేంద్రం నిర్ణయం తీసుకున్న సమయం తమను ఆశ్చర్యానికి గురిచేసింది
- ప్రభుత్వ ఉద్దేశాలపై తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయి
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే




## పాక్‌పై ఫైనాన్షియల్ స్ట్రైక్స్!

- దాయాది దేశ ఆర్థిక పునాదులను పెకలించేందుకు భారత్ యత్నం
- ఎఫ్ఏటీఎఫ్ 'గ్రే'లిస్ట్‌లో పాక్‌ను చేర్చేందుకు ప్రయత్నం
- ఐఎంఎఫ్ భారీ నిధులకు బ్రేకులేసేందుకు ప్రణాళిక

## ఢిల్లీ సహా ఉత్తరాదిన భారీ వర్షం

వివిధ ఘటనల్లో ఏడుగురు మృతి



## ఇందిరమ్మ ఇళ్లు 600 చ.అడుగులకు మించొద్దు



- 400 అడుగులకు తగ్గొద్దు..
- ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాల్లో 500 ఇళ్లు
- 5 నుంచి 20 వరకు 28 మండలాల్లో భూ భారతి సదస్సులు
- కలెక్టర్లు, ఎస్పీలతో పొంగులేటి
- జూన్‌లో సర్వే మ్యాప్ ద్వారా ప్రయోగాత్మకంగా రిజిస్ట్రేషన్లు

**సూర్య, హైదరాబాద్**

ఇందిరమ్మ ఇళ్లను 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మించుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. లబ్ధిదారులు ఈ మేరకు ఇంటి నిర్మాణాలు చేపట్టేలా కలెక్టర్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో - మిగతా2లో



## ఉపాధి హామీ పథకంపై నిఘా

కొత్తగా పంచాయతీ స్థాయిలో పర్యవేక్షణ కమిటీలు
ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**సూర్య, హైదరాబాద్**

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు గ్రామపంచాయతీ స్థాయిలో నిఘా పర్యవేక్షణ (విజిలెన్స్ మానిటరింగ్) కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రస్థాయిలోనే నిఘా కమిటీలు ఉన్నాయి. తొలిసారి - మిగతా2లో

# ముంచెత్తిన నష్టం



- అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఆగమాగం
- వాన ధాటికి పలుచోట్ల కొట్టుకుపోయిన వడ్ల రాశులు
- కొనుగోళ్లలో జాప్యం... రైతులకు తప్పని యాతన

**సూర్య, హైదరాబాద్**

అకాల వర్షాలతో రైతులు తల్లడిల్లిపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దవుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలకు నష్టపోతున్నారు. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు నల్లగొండ, రంగారెడ్డి, - మిగతా2లో



## వణుకుతున్న దాయాది

- భారత్‌ను నిలువరించండి
- అరబ్ దేశాలకు విజ్ఞప్తులు
- రాయబారులతో షరీఫ్ భేటీ
- ఉగ్రవేటలో మేం భారత్‌తోనే
- పాక్‌కు అమెరికా స్పష్టీకరణ
- మీ గడ్డపై ముష్కరులు: వాన్స్
- వారి వేటలో భారత్‌కు తోడ్పడండి
- దాయాదికి ఉపాధ్యక్షుని హితవు
- మాది 'ఉగ్ర'చరిత్రే: బిలావల్
- ఎనిమిదో రోజూ పాక్ కాల్పులు

# అండగా నిలుస్తా భుజం కలిపి నడుస్తా

అమరావతికి, ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ సహకారం: మోదీ

- స్వర్ణాంధ్ర సాధనకు అమరావతి 'శక్తి'!
- ఏపీని అధునాతన ప్రదేశ్‌గా మార్చేస్తుంది
- ఐటీ, ఏఐ, విద్య, వైద్యానికి ఇదే 'లీడింగ్ సిటీ'
- చంద్రబాబు రాకతో గ్రహాలు తొలగిపోయాయి
- అమరావతి పూర్తయ్యాక ఏపీ జీడీపీకి రెక్కలు
- అంతరిక్షంతోపాటు రక్షణలోనూ ఏపీ పతాక
- నాగాయలంక మిస్సైల్ టెస్ట్ రేంజ్‌తో ఘనత
- 'జూన్ 21'న విశాఖలో యోగా చేస్తా

**సూర్య, అమరావతి**

"ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు సరైన దారిలో వెళుతోంది. సరైన వేగం అందుకుంది. రాష్ట్రాభివృద్ధి ప్రస్థానంలో మీతో భుజం కలిపి నడుస్తాను" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు హామీ ఇచ్చారు. అమరావతి పనుల పునరుద్ధరణతోపాటు రాష్ట్రంలోని పలు రైల్వే, రహదారులు, రక్షణ ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. ఇప్పటికే పూర్తయిన ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా అమరావతిలోని వెలగపూడి సచివాలయ సమీపంలో - మిగతా2లో



# తెలంగాణే మార్గదర్శి

-మొదటిపేజీ తరువాయి

కులగణన, పహల్గాం ఉగ్రదాడిపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడారు.

**కాంగ్రెస్ నేతలు అప్రమత్తంగా ఉండాలి: ఖర్గే**

రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర మొదలు, మొన్నటి లోక్‌సభ ఎన్నికల వరకు ఇదే అంశాన్ని ముందుపెట్టి కాంగ్రెస్ పార్టీ పోరాడిందని ఖర్గే చెప్పారు. పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో కులగణన పూర్తి చేసి ప్రభుత్వ పథకాల్లో అమలు చేసే ప్రక్రియను సైతం మొదలు పెట్టిందని ప్రశంసించారు. ప్రజల సమస్యలను నిజాయితీగా లేవనెత్తితే, ఎన్డీఏ వంటి మొండి ప్రభుత్వాలు తలవంచాల్సిందేనని రాహుల్‌గాంధీ నిరూపించారని అన్నారు. అయితే కులగణన సమస్యను ఒక మంచి ముగింపు వచ్చేంత వరకు కాంగ్రెస్ నేతలంతా అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఇదే అంశంపై చేసిన తీర్మానంలోనూ తెలంగాణ అంశాన్ని సీడబ్ల్యూసీ ప్రస్తావించింది.

**తెలంగాణ నమూనాను కేంద్రం అనుసరించాలి**

'తెలంగాణలో కులగణనకు సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం పాటించిన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరించాల్సిన అవసరం ఉందని సీడబ్ల్యూసీ భావిస్తోంది. తెలంగాణలో కుల సర్వే రూపకల్పన పూర్తిగా పౌర సమాజం, సామాజికవేత్తలు, నాయకుల క్రియాశీల ప్రమేయంతో.. సంప్రదింపులు, పారదర్శక ప్రక్రియ ద్వారా జరిగింది. ఈ సర్వే పూర్తిగా బ్యూరోక్రాటిక్ విధానంలో కాకుండా ప్రజల పరిశీలన నుంచి వచ్చింది. అందువల్ల జాతీయ స్థాయి కులగణన కోసం తెలంగాణ పాటించిన విధానాన్ని అనుసరించాలని సీడబ్ల్యూసీ కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా కోరుతోంది. కేంద్రం విశ్వసనీయమైన, శాస్త్రీయమైన, భాగస్వామ్య నమూనాను రూపొందించేందుకు వీలుగా మా పూర్తి మద్దతును ప్రకటిస్తున్నాం. సంప్రదింపులు, జవాబుదారీతనం సమ్మిళితత్వంతో విలువలను ప్రతిబింబించే చట్టాన్ని రూపొందించడంలో సహకరించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..'అని సీడబ్ల్యూసీ తన తీర్మానంలో పేర్కొంది.



**జాప్యం వద్దు..పారదర్శకంగా జరగాలి**

'కులగణన ప్రక్రియలో జాప్యం చేయకూడదు. అన్ని రాజకీయ పార్టీలను పూర్తి విశ్వాసంలోకి తీసుకోవాలి. ఈ అంశంపై పార్లమెంట్‌లో వెంటనే చర్చ జరపాలి. ప్రభుత్వం వెంటనే అవసరమైన నిధులను కేటాయించి, జనాభా లెక్కల ప్రతి దశకు నిర్దిష్టమైన సమయాన్ని ప్రకటించాలి. కులగణన వివరాల నమోదు ప్రక్రియ పూర్తి సమగ్రంగా, పారదర్శకంగా ఉండేలా చూడాలి. రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలకు, విద్యా, ఉపాధి అవకాశాలకు ఈ కులగణనే ప్రాతిపదికగా ఉండాలి. కులగణన సరిగ్గా జరిగి అమలైతే సమాజంలోని అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతుంది..'అని తీర్మానంలో స్పష్టం చేసింది.

**పూర్తి పారదర్శకతతో నిర్వహించాం: సీఎం రేవంత్**

తెలంగాణలో కులగణన జరిగిన తీరును సీడబ్ల్యూసీ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. కచ్చితత్వంతో, పూర్తి పారదర్శకంగా కులగణన నిర్వహించామని తెలిపారు. 'బీసీల జనాభా గతం కన్నా 6 శాతం మేర పెరిగింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో తీర్మానం చేసి, దానిని పార్లమెంట్ ఆమోదానికి పంపించాం. విద్య, ఉద్యోగం, ఉపాధి, నిధుల కేటాయింపుల్లో ఓబీసీ, ఆదివాసీ, దళితులు, మైనార్టీలకు ప్రయోజనం చేకూరేలా ఇకపై ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయి. కులగణనతో ఆయా వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని మేము విశ్వసిస్తున్నాం. మమ్మల్ని చూసే కేంద్రం కూడా కులగణన చేసేందుకు ముందుకొచ్చింది. దీనిపై రాష్ట్రంలోని నిమ్న వర్గాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి..'అని సీఎం తెలిపారు. రేవంత్, దామోదరకు అభినందనలు కులగణన ప్రక్రియలో చేసిన శ్రమ, అమలులో చూపిన చొరవపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదరలను సీడబ్ల్యూసీ కీలక నేతలు అభినందించారు.

# అండగా నిలుస్తా భుజం కలిపి నడుస్తా

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగించారు. అమరావతి, పోలవరం పూర్తికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అమరావతిని ఒక 'శక్తి'గా అభివర్ణించారు. "అమరావతి... స్వర్ణాంధ్ర విజన్‌కు శక్తినిస్తుంది. స్వర్ణాంధ్ర.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని బలపరుస్తుంది. అమరావతి కేవలం ఒక నగరం కాదు... అమరావతి ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునిక ప్రదేశ్‌గా, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి" అని ఉద్ఘాటించారు. చంద్రబాబు మూడేళ్లలో అమరావతిని నిర్మిస్తామని లక్ష్యంగా పెట్టుకున్నారని... ఆ తర్వాత రాష్ట్ర జీడీపీని అమరావతి నగరం ఎక్కడికి తీసుకెళుతుందో తాను ఊహించగలనని ప్రధాని అన్నారు. ప్రభుత్వం ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమరావతి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి భుజం కలిని నడుస్తానని భరోసా ఇచ్చారు. ప్రధాని ప్రసంగంలోని ముఖ్యాంశాలు... ఆయన మాటల్లోనే!

**భవిష్యత్ నగరం...**

ఆంధ్రప్రదేశ్ ప్రజలారా... అమరావతి ఇంద్రలోకపు రాజధాని. ఇప్పుడు... అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధాని. ఇది యాదృచ్ఛికం కాదు. స్వర్ణాంధ్ర నిర్మాణానికి శుభ సంకేతం. అమరావతి పుణ్యభూమిపై నిలబడిన ఈ క్షణం నాకు భవిష్యత్ నగరం కనిపిస్తోంది. ఒక కల నెరవేరుతున్న క్షణాలు కనిపిస్తున్నాయి. ఒక కొత్త అమరావతి, ఒక కొత్త ఆంధ్రప్రదేశ్ కనిపిస్తున్నాయి. ఒకవైపు బౌద్ధవారసత్వ శాంతి... మరోవైపు వికసిత్ భారత్‌ను నిర్మించుకునే శక్తి అమరావతిలో ఉన్నాయి. ఇప్పుడు దాదాపు రూ.60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు జరిగాయి. ఇవి కేవలం కాంక్రీట్ నిర్మాణాలు కావు. ఏపీ ప్రజల ఆకాంక్షలు, వికసిత్ భారత్ ఆశలకు బలమైన పునాదులు. భగవాన్ వీరభద్రస్వామి, అమర లింగేశ్వరుడు, తిరుపతి బాలాజీ పాదాలకు ప్రణమిల్లుతూ... ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియచేస్తున్నా.

**మనమే చేయాలి...**

2015లో ప్రజా రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసే అవకాశం నాకు లభించింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం అమరావతికి మద్దతు ఇచ్చింది. నాడు ఎన్టీఆర్ వికసిత ఆంధ్రప్రదేశ్ గురించి కలగన్నారు. ఇప్పుడు దానిని సాకారం చేయాలి. ఆంధ్రప్రదేశ్‌ను, అమరావతిని వికసిత్ భారత్‌కు గ్రోత్ ఇంజిన్‌లా మార్చాలి. చంద్రబాబు గారు, బ్రదర్ పవన్ కల్యాణ్ ఇది మనం చేయాలి. ఇది మనమే చేయాలి!

**మౌలికంతో వికాసం..**

గత పదేళ్లలో భారత దేశంలో భౌతిక, సాంకేతిక, సామాజిక మౌలిక సదుపాయాలు ఎంతగానో పెరిగాయి. దాని ఫలాలు ఆంధ్రప్రదేశ్‌కూ లభిస్తున్నాయి. నేడు రాష్ట్రానికి వేల కోట్ల విలువైన రైల్వే, రహదారి ప్రాజెక్టులు లభించాయి. జిల్లాల మధ్య, పొరుగు రాష్ట్రాల మధ్య కనెక్టివిటీ పెరుగుతుంది. రైతులు తమ ఉత్పత్తులను పెద్ద మార్కెట్లకు




తరలించవచ్చు. ఉద్యోగులకు, కార్మికులకు రవాణా మెరుగుపడుతుంది. పర్యాటకం మెరుగవుతుంది. ఉదాహరణకు... రేణిగుంట – నాయుడుపేట హైవే పూర్తి కావడంవల్ల తిరుపతికి ప్రయాణం సులువు అవుతుంది. బాలాజీ దర్శనం వేగంగా జరుగుతుంది. మౌలిక సదుపాయాల కల్పన పనులతో సిమెంటు, స్టీల్, రవాణా వంటి ఇతర రంగాలూ ఊపందుకుంటాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. ఇప్పుడు చేపట్టిన ప్రాజెక్టుల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో వేలాదిమంది యువతకు ఉపాధి లభిస్తుంది.

**పది రెట్లు పెరిగిన 'రైల్వే నిధులు'**

ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం రికార్డుస్థాయిలో నిధులు కేటాయించాం. 2009–14లో తెలంగాణతో కలిసి ఉన్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే ప్రాజెక్టులకు కేవలం రూ.900 కోట్లు ఇచ్చారు. ఇప్పుడు... నవ్యాంధ్రకు మాత్రమే రైల్వే బడ్జెట్ 9వేల కోట్లు దాటింది. అంటే... పది రెట్లు ఎక్కువ. కేంద్రం ఇచ్చిన నిధులతో ఏపీలో రైల్వే వందశాతం విద్యుదీకరణ జరిగిపోయింది. రాష్ట్రానికి 8 వందేభారత్ రైళ్లు వచ్చాయి. 'అమృత్ భారత్' రైలు కూడా వస్తుంది. రాష్ట్రంలో 750కి పైగా ఆర్వోబీలు, అండర్ పాస్‌లు నిర్మించాం. 70కిపైగా రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నాం.

**రైతులకు అండగా ఎన్డీయే**

'వికసిత్ భారత్'కు పేదలు, రైతులు, యువకులు, మహిళలు... నాలుగు స్తంభాలని ఎర్రకోటపై నుంచి ఉద్ఘాటించాను. రైతులకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నాం. పదేళ్లలో ఎరువుల కోసం రూ.12 లక్షల కోట్ల భారం భరించాం. పంటల బీమా కింద ఏపీ రైతులకే రూ.5500 కోట్లు పరిహారం చెల్లించాం. పీఎం కిసాన్ నిధి సమ్మాన్ ద్వారా రాష్ట్ర రైతుల ఖాతాల్లో 17,500 కోట్లు జ మ చేశాం. ప్రతి ఎకరాకూ నీరు అందాలన్నదే మా లక్ష్యం. పోలవరం ప్రాజెక్టు నిర్మా ణం వేగం పుంజుకుంది. ఈ ప్రాజెక్టు వేగం గా పూర్తయ్యేలా మద్దతిస్తాం.

**అంతరిక్షం నుంచి రక్షణ దాకా ఏపీ**

దేశాన్ని అంతరిక్ష శక్తిగా మార్చడంలో దశాబ్దాలుగా ఏపీ కీలక పాత్ర పోషిస్తోంది. శ్రీహరికోట నుంచి నింగికెగిసే ప్రతి రాకెట్ కోట్లాదిమంది భారతీయులను గర్వపడేలా చేస్తుంది. ఇప్పుడు... దేశ రక్షణ రంగాన్ని బలోపేతం చేసే కొత్త సంస్థ ఏపీలో ఏర్పాటవుతోంది. అదే... నాగాయలంక మిసైల్ టెస్టింగ్ రేంజ్! 'నవదుర్గా మిస్సైల్ టెస్టింగ్ రేంజ్'... దుర్గామాతలాగా దేశ రక్షణకు కొత్త శక్తినిస్తుంది.

**విశాఖలో ఏకతా మాల్**

ఇప్పుడు భారతదేశ శక్తి... ఆయుధాల్లో మాత్రమే లేదు. మన ఐక్యతలో కూడా ఉంది. ఇదే భావనతోనే... దేశవ్యాప్తంగా 'ఏకతా మాల్స్' ఏర్పాటు చేస్తున్నాం. అందులో... విశాఖలో ఒకటి నిర్మిస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న హస్తకళాకారుల ఉత్పత్తులు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. భారత దేశంలోని వైవిధ్యత ఒకేచోట కనిపిస్తుంది. స్థానిక కళాకారులకూ మేలు జరుగుతుంది. 'ఏక్‌భారత్, శ్రేష్ట్ భారత్' భావన బలపడుతుంది.

**ప్రపంచం ఏపీ వైపు చూసేలా 'యోగా డే'**

'జూన్ 21'ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించి ఈ ఏడాదికి పదేళ్లు అవుతోంది. ఈ అంశాన్ని చంద్రబాబు ప్రస్తావించారు. ఈ ఏడాది ప్రధాన కార్యక్రమాన్ని ఏపీలో నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆ రోజు నేను విశాఖపట్నం వస్తాను. మీ అందరితో కలిసి యోగా చేస్తాను. దీనికి ఇంకా 50 రోజుల సమయం ఉంది. ప్రతి గ్రామానికీ, ఇంటికీ 'యోగా'ను తీసుకెళ్లండి. ప్రాచుర్యం కల్పించండి. ఈసారి జూన్ 21వ తేదీన ప్రపంచమంతా ఏపీవైపు చూస్తుంది. మొత్తం ప్రపంచం ఆశ్చర్యపోయేలా రికార్డు సృష్టిద్దాం. చంద్రబాబు ఆ పని చేస్తారని నాకు నమ్మకముంది.

## ఇందిరమ్మ ఇళ్లు 600 చ.అడుగులకు మించొద్దు

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వ ప్రధాన కార్యాదర్శి రామకృష్ణారావుతో కలిసి ఆయన భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్షకు ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగిరం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు, ఇన్‌చార్జి మంత్రుల నుంచి జాబితాకు ఆమోదం తీసుకోవాలని చెప్పారు. ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500ఇళ్లను కేటాయించి, లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. జాబితాలో ఎవరైనా అనర్హులనీ తేలితే ఇంటి నిర్మాణం ఏ దశలో ఉన్నా రద్దు చేస్తామన్నారు. ఈ పథకంలో భాగంగా ఎల్–1, ఎల్–2, ఎల్–3 జాబితాలను రూపొందించినప్పటికీ వాటితో సంబంధం లేకుండా నిరుపేదలనే పథకానికి ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు.

**28 మండలాల్లో భూ భారతి సదస్సులు..**

ఈ నెల 5 నుంచి 20 వరకు జిల్లాకో మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించనున్నట్లు పొంగులేటి తెలిపారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈ నెల 31కల్లా పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు కాలేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో సదస్సులను నిర్వహించామని తెలిపారు. ఈ నెల 4 నుంచి జరగబోయే నీట్ పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్రం నుంచి 72,572 మంది విద్యార్థులు నీట్‌కు హాజరవుతున్నారని, 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కాగా, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో శిక్షణ పూర్తి చేసుకున్న 390 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు మంత్రి పొంగులేటి శనివారం ధ్రువపత్రాలను అందించనున్నారు.

**జూన్‌లో సర్వే మ్యాప్ ద్వారా రిజిస్ట్రేషన్లు**

జూన్‌లో సర్వే మ్యాప్ ఆధారంగా ప్రయోగాత్మకంగా భూముల రిజిస్ట్రేషన్లు చేస్తామని, త్వరలోనే రాష్ట్రంలో సర్వేయర్ల నియామకానికి ప్రకటన జారీ చేస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. సచివాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సర్వేయర్ల నియామకానికి 6వేల దరఖాస్తులు వచ్చాయని, ప్రైవేట్ సర్వేయర్లతో భూముల సర్వే జరుగుతుందని చెప్పారు. దీనిపై ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందన్నారు. భూ భారతి వల్ల 70 శాతం ప్రజలకు లబ్ధి చేకూరినా తాము విజయవంతమైనట్లేనన్నారు.

**21 మందికి పదోన్నతులు**

రిజిస్ట్రేషన్ శాఖలో 21 మందికి ప్రభుత్వం పదోన్నతులను కల్పించింది. గ్రేడ్–2లో పనిచేస్తున్న సబ్‌రిజిస్ట్రార్లు 10 మందిని గ్రేడ్–1కి, సీనియర్ సహాయకులుగా పని చేస్తున్న 11 మందిని గ్రేడ్–2కి పదోన్నతులు కల్పించారు. శనివారం వీరికి మంత్రి పదోన్నతుల పత్రాలను అందించనున్నారు.

## ఉపాధి హామీ పథకంపై నిఘా

-మొదటిపేజీ తరువాయి

గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం శుక్రవారం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీచేసింది. సామాజిక తనిఖీ నివేదికలపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. రాష్ట్రంలో ఈ పనుల్లో పలుచోట్ల నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన కేంద్ర ప్రభుత్వం.. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు పనిదినాల సంఖ్యను 6.5 కోట్లకు తగ్గించింది. ఈ నేపథ్యంలో పథకాన్ని మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించేందుకు గ్రామస్థాయి నిఘా కమిటీల ఏర్పాటు వైపు ప్రభుత్వం మొగ్గు చూపింది. ఒక్కో గ్రామస్థాయి కమిటీలో అయిదుగురు చొప్పున ప్రభుత్వ సిబ్బంది సభ్యులుగా ఉంటారు. పొరుగు గ్రామాల్లోని వారినే కమిటీలో నియమిస్తారు. ఈ కమిటీలు వారానికి ఒకసారి ఉపాధి హామీ పనులను పరిశీలిస్తాయి. పనుల మంజూరు, నిర్వహిస్తున్న తీరు, కూలీల హాజరు? వారికి చెల్లింపులు ఎలా జరిగాయి? తదితర వివరాలను నమోదు చేసి మండల పరిషత్ అధికారులకు పంపిస్తారు. మండల అధికారులు పరిశీలించి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తారు. దాని ఆధారంగా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. ఉపాధి హామీలో సామాజిక తనిఖీల ప్రక్రియ ఇకపై నిర్ణీత షెడ్యూలు ప్రకారం నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టంచేసింది. "ప్రతి నెలా మొదటి వారంలో తనిఖీలు విధిగా నిర్వహించాలి. పనుల జాబితాను మండల కంప్యూటర్ సెంటర్లు, జిల్లా కంప్యూటర్ సెంటర్ల ద్వారా సామాజిక తనిఖీల కమిటీలకు ఉపాధిహామీ సిబ్బంది సమర్పించాలి. పని వివరాలు, నిర్వహణ తీరు, వ్యయాల సమాచారం అందులో తప్పనిసరిగా ఉండేలా జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చొరవ తీసుకోవాలి" అని ప్రభుత్వం తెలిపింది. సామాజిక తనిఖీ విభాగాలు గుర్తించిన అక్రమాలకు బాధ్యులైన ఉద్యోగుల నుంచి నిధుల రికవరీకి సత్వరమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం తాజా ఆదేశాల్లో సూచించింది.

**నల్లబ్యాడ్జీలతో ఉపాధిహామీ ఉద్యోగుల నిరసనలు**

తమకు నాలుగు నెలలుగా వేతనాలు విడుదల చేయడంలేదని రాష్ట్ర ఉపాధి హామీ ఉద్యోగుల ఐకాస ఆధ్వర్యంలో ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసనలు తెలిపారు. మండల కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించారు. వేతనాలు చెల్లించాలని నినాదాలు చేశారు. జనవరి నుంచి తమకు వేతనాలు రాకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామని ఐకాస నేత చరణ్‌రాజు శుక్రవారం తెలిపారు. 2024–25లో తాము 12.22 కోట్ల పనిదినాలను నిర్వహించినా రాష్ట్ర ప్రభుత్వం తమకు వేతనాలు చెల్లించకుండా అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు.

## ముంచెత్తిన నష్టం

-మొదటిపేజీ తరువాయి

మేడ్చల్, వరంగల్, ఖమ్మం, భూపాలపల్లి జిల్లాల్లో ఒక్కసారిగా కురిసిన వర్షంతో రైతులు కొనుగోలు కేంద్రాలలో నిల్వ ఉంచిన ధాన్యం తడిసిపోయింది. కొన్ని చోట్ల వర్షం ధాటికి ధాన్యం కొట్టుకుపోయింది. ఖమ్మంలో నష్టం అధికంగా జరిగినట్టు అధికార యంత్రాంగం ప్రాథమికంగా అంచనా వేసింది.

**కొనుగోళ్లలో ఆలస్యంతోనే...**

యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఇప్పటికే దాదాపుగా 60 శాతానికి పైగా కోతలు పూర్తయినా, కొనుగోళ్లు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. లారీల కొరత, మిల్లర్ల కొర్రీలు, గోనె సంచులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి రైతులు వేచి చూసే పరిస్థితి ఏర్పడింది. ఐకేపీ, పీఏసీఎస్ వంటి సహకార సంఘాలు మిల్లర్ల మీద ఆధారపడి కొనుగోలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. లారీలు రావడం లేదని, మిల్లర్లు క్వింటాల్‌కు 5 నుంచి 10 కిలోల తరుగు తీస్తేనే మిల్లులకు ధాన్యం ఇవ్వాలంటున్నారని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులే చెప్పే పరిస్థితి కరీంనగర్, ఖమ్మం, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో కొనుగోళ్లు ఆలస్యం కావడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుంది. తిరిగి ఆ ధాన్యాన్ని ఎండబెట్టి, తేమ శాతం 17 శాతం వచ్చిన తర్వాత విక్రయించాలంటే ఎన్ని రోజులు ఆగాలో తెలియని పరిస్థితి.

**ఆయా జిల్లాల్లో ఇలా....**

ఖమ్మం జిల్లా వైరా మార్కెట్ యార్డులో ఆరబోసిన 3 వేల క్వింటాల ధాన్యం తడిసి ముద్దయ్యింది. కూసుమంచి మండలంలోనూ ధాన్యం తడిసింది. మహబూబాబాద్ జిల్లాలోని కురవి, మరిపెడ, కేసముద్రం, డోర్నకల్, గూడూరు, మహబూబాబాద్, నర్సింహులపేట, బయ్యారం, గార్ల మండలాల్లో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. యాదాద్రి భువనగిరి జిల్లాలోని చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, భూదాన్ పోచంపల్లి ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వ్యవసాయ మార్కెట్లు, ఐకేపీ సెంటర్లలో ధాన్యం నీటిలో కొట్టుకుపోయింది.

# ఉగ్రదాడిని ఎదుర్కొనేందుకు నిర్దిష్ట వ్యూహం ఏది?

**న్యూఢిల్లీ**

పహల్గాం ఉగ్రదాడిని ఎదుర్కొనేందుకు విపక్షాలు కేంద్రంతో ఉన్నాయని తాము స్పష్టం చేసినప్పటికీ ఇంతవరకూ కేంద్ర వద్ద నిర్దిష్టమైన వ్యూహం ఏమీ కనిపించడం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. శుక్రవారంనాడిక్కడ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కులగణన చేపట్టాలని కాంగ్రెస్ చేసిన డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించిదని, అయితే కేంద్రం నిర్ణయం తీసుకున్న సమయం తమను ఆశ్చర్యానికి గురిచేసిందని చెప్పారు. ప్రభుత్వ ఉద్దేశాలపై తమకు కొన్ని అనుమానాలు ఉన్నాయన్నారు. కులగణనపై ఒక లాజికల్ కంక్లూజన్ వచ్చేంతవరకూ పార్టీ నేతలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉగ్రవాదంపై పోరులో కేంద్రానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని గత సీడబ్ల్యూసీ సమావేశం స్పష్టం చేసిన విషయాన్ని ఖర్గే గుర్తు చేశారు. పహల్గాం ఉగ్రదాడి జరిగి ఇన్ని రోజులైనా కేంద్రం ఇంతరవకూ స్పష్టమైన హ్యూహంతో ముందుకు రాలేదని అన్నారు. కులగణన నిర్వహించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం క్రెడిట్ రాహుల్ గాంధీకే దక్కుతుందని, ప్రజా సమస్యలపై నిజాయితీగా గళం విప్పితే ప్రభుత్వం దిగిరాక తప్పదని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ మరోసారి నిరూపించారని కొనియాడారు. ఉగ్రదాడిలో మరణించిన బాధిత కుటుంబాలను రాహుల్ గాంధీ కాన్పూర్‌లో పరామర్శించారని, వారికి అమరుల హెూదా కల్పించాలని కోరారని ఖర్గే చెప్పారు.

**ఖర్గే ప్రసంగంలో ఇంకా..**

–పహల్గాం ఉగ్రదాడి అనంతరం ఏప్రిల్ 24న సిడబ్ల్యూసీ సమావేశం నిర్వహించాం. ఉగ్రవాదంపై పోరుకు, ఉగ్రవాదులకు గుణపాఠం చెప్పేందుకు ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని తీర్మానం ఆమోదించాం.



–హహల్గాం ఉగ్రదాడి జరిగి ఇన్ని రోజులైనా ప్రభుత్వం ఒక స్పష్టమైన వ్యూహంతో ముందుకు రాలేదు.
–రాహుల్ గాంధీ కాన్పూర్‌లో శుభం ద్వివేది కుటుంబ సభ్యులను కలిసారు. అమరవీరుల హెూదా కల్పించాలని కోరారు.
–దేశ ఐక్యత, సమగ్రత, అభ్యుదయం విషయంలో ఎలాంటి సవాళ్లు ఎదురైనా సమష్టి ఎదుర్కొనేందుకు మేము సిద్ధం. ఈ విషయంలో విపక్షాలన్నీ ప్రభుత్వానికి బాసటగా ఉంటాయి. మేము ఈ సందేశాన్ని యావత్ ప్రపంచానికి చాటాం.
–ఈ క్రమంలోనే మోదీ ప్రభుత్వం దేశ జనాభా గణనతో పాటు కులగణన చేపట్టాలని నిర్ణయించింది.
–ఈ విషయంలో నేను రాహుల్ గాంధీని మొదట అభినందిస్తున్నాను. కులగణన అంశాన్ని రాహుల్ లేవనెత్తి, ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేశారు. భారత్ జోడో యాత్రతో రాహుల్ శక్తివంతమైన ప్రచారం సాగించారు. దీంతో 18వ లోక్‌సభ ఎన్నికల్లో సామాజిక న్యాయం అనేది కీలకాంశమైంది.
–నిజాయితీతో ప్రజాసమస్యలను లేవనెత్తితే ప్రభుత్వం దిగివస్తుందని రాహుల్ నిరూపించారు. భూ సేకరణ సవరణ బిల్లు, మూడు రైతు చట్టాల ఉపసంహరణ తర్వాత ఆ జాబితాలో ఇప్పుడు కులగణన కూడా వచ్చి చేరింది. కులగణనపై ప్రభుత్వం దిగివచ్చింది.
–తెలంగాణ, కర్ణాటకలో కులసర్వే ప్రక్రియను కాంగ్రెస్ ప్రభుత్వాలు పూర్తి చేశాయి. ప్రభుత్వ పథకాలలో దీనిని అమలు చేయడం కూడా మొదలైంది.
–గుజరాత్‌లో 2025 ఏప్రిల్ 9న జరిపిన ఏఐసీసీ సదస్సులో మా డిమాండ్‌ను పునరుద్ఘాటించాం. 50 శాతం రిజర్వేషన్ పరిమితిని ఎత్తివేయాలని మేము డిమాండ్ చేస్తున్నాం. రాజ్యాంగ సవరణ ద్వారా పరిమితిని ఎత్తివేసే ప్రక్రియ ప్రారంభించాలి.
–కులగణన విషయంలో 2023 ఏప్రిల్ 16న ప్రధానికి లేఖ రాసినప్పుడు ప్రభుత్వం ఇందుకు పూర్తి వ్యతిరేకంగా ఉంది. అకస్మాత్తుగా ఇప్పుడు నిర్ణయం మార్చుకుంది.
–ప్రభుత్వం మా డిమాండ్‌ను ప్రతి వేదికపైన వ్యతిరేకిస్తూ వచ్చింది. ఇది విభజన నిర్ణయం, అర్బన్ నక్సల్స్ నిర్ణయం అంటూ విమర్శించింది. మోదీ నుంచి ఆర్ఎస్ లీడర్ల వరకూ ప్రతి ఒక్కరూ రాష్ట్ర ఎన్నికల్లో మా డిమాండ్‌ను విమర్శించారు. ఇప్పుడు ప్రభుత్వం కులగణన నిర్ణయం తీసుకోవడంతో ఆ క్రెడిట్ బీజేపీకి, ప్రధాన మంత్రికి దక్కుతుందంటూ ఆ పార్టీ నేతలు చెప్పుకొంటున్నారు.

## ఢిల్లీ సహా ఉత్తరాదిన భారీ వర్షం

**న్యూఢిల్లీ**

దేశ రాజధాని ఢిల్లీ సహా పలు ఉత్తరాది రాష్ట్రాలు శుక్రవారం ఉదయం ఈదురు గాలులు, వర్షాలతో అతలాకుతలమయ్యాయి. రహదారులపైకి వరద నీరు చేరడంతోపాటు, పలు చోట్ల చెట్లు కూలడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. విమానాల రాకపోకలకు సైతం అంతరాయం ఏర్పడింది. వర్షం సంబంధిత ఘటనల్లో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. నజఫ్‌గఢ్ ప్రాంతంలోని ఖరా?రీలో ఇంటిపై చెట్టు కూలినపడినట్లు ఉదయం 5.30 గంటల సమయంలో పోలీసులకు సమాచారం అందింది. భారీ వర్షం, తీవ్ర ఈదురుగాలుల కారణంగా ఒకే గది ఉన్న చిన్న ఇంటిపై పక్కనే ఉన్న చెట్టు కూలి పడింది. ఘటనలో ఆ ఇంట్లోని ఐదుగురు శిథిలాల కింద చిక్కుకుపోయారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది కలిసి వారిని బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. ఒక మహిళ(28), ఆమె ముగ్గురు చిన్నారులు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మహిళ భర్త గాయాలతో చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. అదే సమయంలో చావ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో పాపారావత్ గ్రామంలో గోడ కూలి ఇద్దరు బాలురు సహా ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారని చెప్పారు. ఒక్కసారిగా కురిసిన వర్షంతో ఢిల్లీ, గురుగ్రామ్, ఫరీదాబాద్, మధుర రోడ్లపై పెద్ద ఎత్తున వరద నిలిచిపోయింది. ఘజియాబాద్‌లో రోడ్లపై వాహనాలు కిలోమీటర్ల కొద్దీ బారులు తీరి కనిపించాయి. ఫరీదాబాద్‌లో వరదలో సగం వరకు మునిగిన కారును జనం బయటకు తీస్తున్న దృశ్యాలు వైరల్ అయ్యాయి.

**200 విమానాలు ఆలస్యం**

ఈదురు గాలుల ప్రభావం ఢిల్లీలో విమానాల రాకపోకలపైనా పడింది. మూడు విమానాలను దారి మళ్లించగా 200కు పైగా ఆలస్యంగా నడిచాయని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. కుండపోతతో ట్రాఫిక్ అంతరాయం, వరదలు, చెట్లు, ఇళ్లు కూలిన ఘటనలకు సంబంధించి 100 కాల్స్ అందాయని ఫైర్ విభాగం తెలిపింది.

## పాక్ ప్రధాని యూట్యూబ్ ఛానల్ బ్యాన్

జమ్మూ – కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను బలిగొన్న ఘోరమైన ఉగ్రవాద దాడిపై కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాకిస్తాన్ ప్రధాన మంత్రి 'షెహబాజ్ షరీఫ్' యూట్యూబ్ ఛానెల్‌ను శుక్రవారం భారతదేశంలో బ్లాక్ చేశారు. కొన్ని రోజుల క్రితం భారత ప్రభుత్వం 16 పాకిస్తానీ యూట్యూబ్ ఛానెల్‌లను నిషేధించిన తర్వాత ఈ ఖాతాలను బ్లాక్ చేశారు. వీటిలో డాన్ న్యూస్, సమా టీవీ, ఏఆర్‌వై న్యూస్ వంటి ప్రముఖ మీడియా సంస్థలు ఉన్నాయి. రెచ్చగొట్టే.. మతపరంగా సున్నితమైన కంటెంట్, తప్పుదారి పట్టించే కథనాలు మాత్రమే కాకుండా భారతదేశానికి వ్యతిరేకంగా తప్పుడు సమాచారం ప్రసారం చేసినందుకు ఈ ఛానెల్‌లను నిషేధించారు. 'షెహబాజ్ షరీఫ్' యూట్యూబ్ ఛానెల్‌ను బ్లాక్ చేయడంతో పాటు.. గాయకుడు అతిఫ్ అస్లాం, క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, బాబర్ ఆజం, నటుడు ఫవాద్ ఖాన్, హనియా అమీర్, మహిరా ఖాన్‌లతో సహా అనేక మంది పాకిస్తాన్ ప్రముఖుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు కూడా సస్పెండ్ చేశారు. పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి జరిగిన తరువాత.. భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం మాత్రమే కాకుండా, అటారీ–వాఘా సరిహద్దును కూడా పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్ గగనం తలంలో పాక్ విమాన ప్రయాణాలపై నిషేధం విధించింది.

## సిక్కు ఆర్మీ సైనికులకు రెచ్చగొట్టేలా

**న్యూఢిల్లీ**

ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి వివాదస్పద వీడియో సందేశం ఇచ్చాడు. భారత సైన్యంలోని సిక్కు జవాన్లను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశాడు. పాకిస్థాన్‌తో భారత్ యుద్ధం చేస్తే సిక్కు సైనికులు పోరాడవద్దని విజ్ఞప్తి చేశాడు. సిక్కులకు, ఖలిస్థాన్‌కు పాకిస్థాన్ 'స్నేహపూర్వక' దేశమని పేర్కొన్నాడు. 'భారతదేశం పాకిస్థాన్‌పై దాడి చేస్తే, అది భారతదేశానికి, ప్రధాని మోదీకి చివరి యుద్ధం అవుతుంది. భారతదేశం వైపు ఉన్న పంజాబీలు పాకిస్థాన్ సైన్యానికి లంగర్‌గా పనిచేస్తారు' అని ఆ వీడియోలో అన్నాడు. కాగా, సిక్కు సైనికులకు పాకిస్థాన్ శత్రువు కాదని పన్నూన్ తెలిపాడు. పంజాబ్‌ను విముక్తి చేసిన తర్వాత పొరుగుదేశం అవుతుందని చెప్పాడు. 'ఇప్పుడు నరేంద్ర మోదీ యుద్ధానికి నో చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది. పాకిస్థాన్‌తో పోరాడకండి. పాకిస్థాన్ మీ శత్రువు కాదు. సిక్కు ప్రజలకు, ఖలిస్థాన్‌కు పాకిస్థాన్ స్నేహపూర్వక దేశంగా ఉంటుంది.

# పాక్‌పై ఫైనాన్షియల్ స్ట్రైక్స్!

**న్యూఢిల్లీ**

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో సర్జికల్ స్ట్రైక్స్ చేసి డజన్లకొద్దీ ముష్కరులను అంతమొందించిన భారత ఇప్పుడు పహల్గాం దాడికి ప్రతీకారంగా పాకిస్తాన్ ఆర్థిక మూలాలపై కోలుకోలేని దెబ్బ కొట్టాలని కంకణం కట్టుకుంది. అందులోభాగంగా విదేశీ నిధులను పాక్ సర్కార్ ఉగ్ర కార్యకలాపాలు, సీమాంతర ఉగ్రవాదం, ఇతర చీకటి పనులను కేటాయిస్తోందని నిరూపించడం ద్వారా విదేశీ సాయం నిలిచిపోయేలా చేయాలని భారత్ యోచిస్తోంది. ఇందుకోసం ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్(ఎఫ్ఏటీఎఫ్)పై భారత్ తీవ్ర స్థాయిలో ఒత్తిడిచేయనుంది. ఈ టాస్క్‌ఫోర్స్‌కు చెందిన 'గ్రే'జాబితాలోకి చేరితే ఆయా దేశాలకు అంతర్జాతీయ సాయం, నిధుల మంజూరు, విదేశాల మద్దతు, విదేశీ పెట్టుబడులు రావడం చాలా కష్టమవుతుంది. దీనికితోడు ఇప్పటికే అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ ద్వారా పాకిస్తాన్‌కు రాబోయే వందల కోట్ల విలువైన నిధులను అడ్డుకుని పాక్‌ను ఆర్థిక కష్టాల కడలిలో ముంచాలని మోదీ సర్కార్ తీవ్రంగా శ్రమిస్తోంది.

**గతంలో పాక్‌పై గ్రే లిస్ట్ కొరడా**

విదేశీ నిధులను పూర్తిగా దేశాభివృద్ధికి కోసం కేటాయించకుండా అందులో కొంత మొత్తాలను ఉగ్ర సంబంధ కార్యకలాపాలకు వెచ్చించినట్లు పాకిస్తాన్‌పై ఆరోపణలు వచ్చాయి. ఇవి నిజమని తేలడంతో పాక్‌ను 2018 జూన్‌లో ఎఫ్ఏటీఎఫ్ తన గ్రే లిస్ట్‌లో పెట్టింది. దీంతో విదేశీ సాయం అందక పాక్ తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంది. దీంతో బుద్ధి తెచ్చుకున్న పాకిస్తాన్ తన ఉగ్రకార్యకలాపాలకు నిధుల్లో కోత పెట్టింది. పలువురు ఉగ్రవాదులను అరెస్ట్‌చేసింది. దీంతో ఎట్టకేలకు 2022 అక్టోబర్‌లో గ్రే జాబితా నుంచి పాకిస్తాన్‌కు విముక్తి లభించింది. ఇప్పుడు సైతం ఇలాగే పాకిస్తాన్‌ను గ్రే జాబితాలోకి చేర్చేలా ఎఫ్ఏటీఎఫ్‌పై మోదీ సర్కార్ ఒత్తిడిని పెంచింది. ఎఫ్ఏటీఎఫ్‌లో 40 సభ్యదేశాలున్నాయి. వీటిలో భారత్ తన అత్యంత స్నేహశీల దేశాల ద్వారా ఈ పని ముగించాలని చూస్తోంది. ఎఫ్ఏటీఎఫ్ ప్లీనరీ సమావేశాలు ఏటా ఫిబ్రవరి, జూన్, అక్టోబర్‌లో జరుగుతాయి. ఈ జూన్ సెషన్‌లో ఈ మేరకు మద్దతు కూడగట్టేందుకు మిత్రదేశాలతో భారత్ ఇప్పటికే సంప్రదింపులు మొదలెట్టినట్లు వార్తలొచ్చాయి.

**ఐఎంఎఫ్‌పైనా కేంద్రం ఒత్తిడి**

స్వదేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, తగ్గిపోయిన విదేశీ పెట్టుబడులతో సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న పాకిస్తాన్ దేశ పాలన కోసం తరచూ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థపై ఆధారపడుతోంది. దీంతో వచ్చే మూడేళ్లలో 7 బిలియన్ డాలర్లు ఇచ్చేందుకు ఐఎంఎఫ్ ఒప్పుకుంది. ఈ నిధులొస్తే పాక్ వాటిని ఉగ్రకార్యకలాపాలకు దుర్వినియోగం చేయనుందని భారత్ ఐఎంఎఫ్ ఎదుట ఆందోళన వ్యక్తంచేయనుంది. భారత వాదన నెగ్గితే ఈ నిధులు ఆగిపోవడమో, తగ్గిపోవడమో జరగొచ్చు. నిధుల విస్తరణపై మే 9వ తేదీన ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ బోర్డ్, పాక్ ఉన్నతాధికారుల మధ్య తొలి సమీక్ష సమావేశం జరగనుంది. పాకిస్తాన్‌కు నిధుల మంజూరుపై పునరాలోచన చేస్తే మంచిదని ఇతర అంతర్జాతీయ బహుళజాతి సంస్థలు, సంఘాలను సైతం భారత్ కోరబోతోంది. ప్రజాపనుల రుణాలు, సాంకేతిక సహకారానికి సంబంధించి మొత్తంగా 764 పనులకు గాను ఏకంగా 43.7 బిలియన్ డాలర్ల నిధులను పాక్‌కు ఇచ్చేందుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నిర్ణయించింది. ఇప్పటికే 9.13 బిలియన్ డాలర్ల రుణాలిచ్చింది. నాలుగు నెలల క్రితం ప్రపంచ బ్యాంక్ సైతం పాకిస్తాన్‌కు 20 బిలియన్ డాలర్ల రుణం ఇచ్చేందుకు అంగీకరించింది.

# వణుకుతున్న దాయాది

**ఇస్లామాబాద్/వాషింగ్టన్/శ్రీనగర్/న్యూఢిల్లీ:**

భార త 'పహల్గాం ప్రతీకార'ప్రయత్నాలు చూసి పాకిస్తాన్ బెదిరిపోతోంది. ఉద్రిక్తతలను ఎలాగైనా తగ్గించేలా భారత్‌ను ఒప్పించాలంటూ అరబ్ దేశాలను ఆశ్రయించింది. సౌదీ అరేబియా, యూఈఏ, కువైట్ తదితర దేశాలకు పాక్ ప్రధాని షహబాజ్ షరీఫ్ శుక్రవారం ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. పాక్‌లోని ఆ దేశాల రాయబారులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దక్షిణాసియాలో సుస్థిరతనే కోరుతున్నామంటూ శాంతి వచనాలు వల్లెవేశారు. పహల్గాం దాడితో పాక్‌కు ఏ సంబంధమూ లేదంటూ పాతపాటే పాడారు. పాక్‌లో చైనా రాయబారి జియాంగ్ జైడాంగ్‌తో కూడా షహబాజ్ భేటీ అయ్యారు. ఉగ్రవాదంపై పోరుతో భారత్‌కు తాము పూర్తిస్థాయిలో దన్నుగా నిలుస్తామని అమెరికా పునరుద్ఘాటించింది. ఈ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీకి తమ పూర్తి మద్దతుందని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ స్పష్టం చేశారు. భారత్, పాక్ మధ్య నెలకొన్న పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఈ విషయమై నిర్ణాయక వ్యాఖ్యలు చేశారు. పాక్ భూభాగం నుంచి మారణకాండకు దిగుతున్న ఉగ్రవాదులను వెదికి పట్టుకోవడంలో భారత్‌కు సహకరించాలని దాయాదికి హితవు పలికారు. "ఇరుదేశాల మధ్య పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయి. అవి రెండు అణుదేశాల ప్రాంతీయ యుద్ధంగా మారొద్దన్నదే మా ఉద్దేశం. ఏం జరుగుతుందో చూద్దాం"అని గురువారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అభిప్రాయపడ్డారు. పహల్గాం దాడి సమయంలో వాన్స్ కుటుంబంతో పాటు భారత్‌లోనే ఉండటం తెలిసిందే. దాయాదుల మధ్య ఉద్రిక్తతలు తగ్గాలని బ్రిటన్ ఆకాంక్షించింది. పహల్గాం దాడిని హౌస్ ఆఫ్ లార్డ్స్ తీవ్రంగా ఖండించినట్టు పేర్కొంది. వాటిని నిరసిస్తూ బ్రిటన్‌లో కొద్ది రోజులుగా శాంతియుత ఆందోళనలు జరుగుతున్న వైనం కూడా సభలో చర్చకు వచ్చినట్టు పేర్కొంది.



**అదేమీ రహస్యం కాదు: బిలావల్**

పాక్ ఉగ్రవాదులకు ఆశ్రయంగా మారడం నిజమేనని ఆ దేశ మాజీ విదేశాంగ మంత్రి, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ చైర్‌పర్సన్ బిలావల్ భుట్టో కూడా అంగీకరించారు. మూడు దశాబ్దాలుగా పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషించిందని ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల అంతర్జాతీయ మీడియా సాక్షిగా అంగీకరించడం తెలిసిందే. దీనిపై స్కై న్యూస్ ఇంటర్వ్యూలో బిలావల్ ఈ మేరకు స్పందించారు. రక్షణ మంత్రి వ్యాఖ్యలతో ఏకీభవిస్తారా అని ప్రశ్నించగా, 'అది పెద్ద రహస్యమేమీ కాదు. పాక్‌ది ఉగ్రవాద గతమే"అంటూ పాక్ నిర్వాకాన్ని బాహాటంగా అంగీకరించారు. అయితే దానివల్ల దేశం ఎంతగానో నష్టపోయిందని వాపోయారు. "ఉగ్రవాదం పాక్‌కే కాదు, అంతర్జాతీయ సమాజానికి కూడా పెనుబెడదగా పరిణమించింది. పాక్ దశలవారీగా ఉగ్రవాదానికి మద్దతిస్తూ వచ్చింది. మా సమాజం ఇస్లామీకరణ, సైనికీకరణ దశల గుండా సాగింది. వీటన్నింటివల్లా మేం నష్టపోతూ వచ్చాం. అయితే వాటినుంచి పాఠాలు నేర్చుకున్నాం. సింధూ పరివాహక నదులకు భారత్ నీరు వదలకుంటే రక్తం పారుతుందంటూ బిలావల్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. తన ఉద్దేశం అది కాదని ఆయన తాజాగా చెప్పుకొచ్చారు. "నీటిని ఆపడాన్ని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని మా ప్రభుత్వమే చెప్పింది. యుద్ధం జరిగితే పారేది రక్తమేగా. అదే నేనూ చెప్పా"అన్నారు. మరోవైపు సింధూ జల ఒప్పందం నిలుపుదలను నిరసిస్తూ భారత్‌కు దౌత్య నోటీసులివ్వాలని పాక్ యోచిస్తోంది. ఈ అంశాన్ని అంతర్జాతీయ వేదికల మీదా లేవనెత్తేందుకు సిద్ధమవుతోంది.

**హాకింగ్‌కు విఫలయత్నాలు**

పాక్ ప్రేరేపిత హాకర్ గ్రూపులు భారత వెబ్‌సైట్లపై శుక్రవారం మరోసారి భారీగా సైబర్ దాడులకు దిగాయి. జమ్మూలోని ఆర్మీ స్కూల్స్, రిటైర్డ్ సైనికుల ఆరోగ్య సేవలు తదితరాలకు సంబంధించిన సైట్లను హాక్ చేసేందుకు విఫలయత్నం చేశాయి. సైబర్ గ్రూప్ హెూక్స్1337, నేషనల్ సైబర్ క్రూ పేరిట దాడులు జరిగినట్టు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. "పాక్‌తో పాటు పలు పశ్చిమాసియా దేశాలు, ఇండొనేసియా, మొరాకో తదితర చోట్ల నుంచి ఈ సైబర్ దాడులు జరిగాయి. వాటికి పాల్పడ్డ పలు సంస్థలు ఇస్లామిక్ భావజాలానికి మద్దతు పలుకుతున్నట్టు చెప్పుకున్నాయి. వాటన్నింటినీ సమర్థంగా తిప్పికొట్టాం"అని తెలిపాయి. పహల్గాం దాడి నుంచీ ఈ తరహా దాడులు విపరీతంగా పెరిగిపోయినట్టు వెల్లడించాయి. ఇదంతా పాక్ హైబ్రిడ్ యుద్ధతంత్రంలో భాగమని అనుమానిస్తున్నారు.

**ఐదు సెక్టర్లలో కాల్పులు**

పాక్ వరుసగా ఎనిమిదో రోజు కాల్పుల విరమణకు తూట్లు పొడిచింది. జమ్మూ కశ్మీర్‌లో ఐదు జిల్లాల వెంబడి నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి గురువారం రాత్రి కూడా కాల్పులకు తెగబడింది. కుప్వారా, బారాముల్లా, పూంచ్, నౌషేరా, అఖ్నూర్ ప్రాంతాల్లో ఎలాంటి కవ్వింపులూ లేకుండానే పాక్ దళాలు తేలికపాటి ఆయుధాలతో కాల్పులకు దిగినట్టు సైన్యం అధికార ప్రతినిధి వెల్లడించారు. "తొలుత ఉత్తర కశ్మీర్‌లో కుప్వారా, బారాముల్లా జిల్లాల్లో మొదలైన కాల్పులు జమ్మూ ప్రాంతంలోని పూంచ్, అఖ్నూర్ సెక్టర్లకు విస్తరించాయి. అనంతరం నౌషేరాలోని సుందర్బనీ, జమ్మూ జిల్లాలో అంతర్జాతీయ సరిహద్దు గుండా పర్గ్వాల్ సెక్టర్లోనూ కాల్పులకు తెగబడ్డాయి. వాటిని భారత సైన్యం దీటుగా తిప్పికొట్టింది"అని తెలిపారు. ఉద్రిక్తతలు మరింత పెరగవచ్చన్న అంచనాల నేపథ్యంలో జమ్మూ కశ్మీర్‌లోని సరిహద్దు గ్రామాల ప్రజలు సురక్షితంగా తలదాచుకునేందుకు యుద్ధ ప్రాతిపదికన కమ్యూనిటీ, వ్యక్తిగత బంకర్లను సిద్ధం చేసుకుంటున్నారు. కథువా, సాంబా, రాజౌరీ, పూంచ్ జిల్లాల్లో ఇంకా పంటకోతలు జరగాల్సి ఉంది. పాక్‌తో భారత్ 3,323 కి.మీ. మేరకు సరిహద్దును పంచుకుంటోంది. ఇందులో 2,400 కి.మీ. మేరకు అంతర్జాతీయ సరిహద్దు గుజరాత్ నుంచి జమ్మూ దాకా విస్తరించింది. 740 కి.మీ. నియంత్రణ రేఖ, యాక్చ్యువల్ గ్రౌండ్ పొజిషన్ లైన్ (ఏజీపీఎల్)తో పాటు మరో 110 కి.మీ. సియాచిన్ ప్రాంతంలో విస్తరించి ఉంది.

# కానరాని మీడియా స్వేచ్ఛ..

ఆఫ్రికాలోని చాలా దేశాల్లో పత్రికా స్వేచ్ఛపై ఆంక్షలు ఉండేవి. వాటికి నిరసనగా ఆఫ్రికన్ జర్నలిస్టులు 1991, ఏప్రిల్ 29 నుండి మే 3వ తేదీవరకు ఆఫ్రికాలోని నమీబియా దేశపు విండ్ హాక్ నగరంలో సమావేశం ఏర్పాటుచేసి, పత్రికా స్వేచ్ఛకు సంబంధించిన అనేక తీర్మానాలు వచ్చాయి. ఆఫ్రికన్ జర్నలిస్టుల నిరసనగా గుర్తుగా మే 3వ తేదీని ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవంగా జరపాలని 1993, డిసెంబరు నెలలో ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం నిర్ణయించింది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19 ఆర్టికల్‌కు అనుగుణంగా పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛ ప్రాధాన్యతను గుర్తు చేస్తూ ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛ దినంగా మే 3వ తేదీని ప్రకటించడం కూడా జరిగింది. అప్పటినుంచి ప్రతి సంవత్సరం మే 3వ తేదీనపత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవంను జరుపుకుంటున్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన మీడియా రంగానికి కష్టకాలంలో ఉంది. మీడియాకు స్వేచ్ఛ ఎండ మావే అవుతున్నది. మే 3వ తేదీ "ప్రపంచ పత్రికా స్వేచ్ఛాదినం", నవంబరు 16న "భారత పత్రికా దినం". ఇలా ఎన్ని దినోత్సవాలు జరిపినా పరిస్థితులలో మార్పు రాకపోవడం విచారకరం. భారత స్వాతంత్ర్యానికి ముందు కూడా మీడియాలో రెండు తరగతులు వుండేవి. ఒకటి స్వాతంత్ర్య లక్ష్యం కోసం ప్రధానంగా పని చేసినవి, రెండవ తరగతి బ్రిటీష్ సామ్రాజ్య వాదులతో ఘర్షణ పడకుండా స్వామికార్యం, స్వకార్యం నెరవేర్చుకొనేవి. తరువాత దేశ మీడియాలో ఆగీత చెరిగి పోయింది. ప్రజల కోసం, ప్రజల సమస్యల మీద కేంద్రీకరణ లేదు. ఎవరు అధికారంలో వుంటే వారికి అనుకూలంగా, పెట్టుబడిపై లాభాలను ఆర్జించే వ్యాపకంగా మారింది. అందుకోసం వార్తను, దృశ్యాన్ని వ్యాపార సరకులుగా మార్చి వేశారు. స్వాతంత్ర్యానికి ముందు బ్రిటీష్ వారిని వ్యతిరేకిస్తూ పత్రికలు పెట్టిన ఎందరో తమ ఆస్తులను ఫణంగా పెట్టారు. ప్రస్తుతం అధిక సంఖ్యాక పత్రికలు, చానళ్లు లాభాల కోసం నడుస్తున్నవే. మా పత్రిక ధర మీరు కొనే సమోసా కంటే తక్కువే అని గతంలో ఒక మీడియా సంస్థ ప్రచారం చేసుకుంది. ఇప్పటికీ పత్రికలు సమోసా కంటే తక్కువ ధరలకే లభిస్తున్నాయి. ఒక్క పత్రికలు తప్ప ప్రపంచంలో ఏ వస్తువూ తయారీ ధరకంటే తక్కువకు లభ్యం కావటం లేదు. దీని అర్థం వాటి నిర్వాహకులు తనకు తగిన ఆదాయం, లాభాలు లేకుండా నడుపుతున్నారనా? టీవీ ఛానల్స్ కూడా అంతే. కొన్ని పార్టీలు, వాటి నేతలు, వ్యాపార సంస్థల వార్తలను ఇస్తే ఏదో మార్గంలో కాసులు కురుస్తాయి. కొన్నింటికి మాత్రమే ఎలాంటి ప్రతిఫలమూ వుండదు. అందుకే నేడు నూటికి తొంభై తొమ్మిది సంస్థలు మాకేమిటి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి. అలాంటి వాటికి భావ ప్రకటనా స్వేచ్ఛ వుంటేనే లేకపోతేనేం. నేడు మీడియా సంస్థలను డబ్బులు సంపాదించే పెట్టుబడి దారులు నడుపుతున్నారు తప్ప సంపాదకులకు ఎలాంటి స్వేచ్ఛ లేకుండా పోతోంది.




సంపాదన, అధికారం ధ్యేయాలైన మీడియా నిర్వాహకులు వార్తలను అమ్ము కోవటానికి ఏమాత్రం వెనకాడటం లేదు. ఈ కారణంగానే గతంలో, ప్రస్తుతం ఎవరు అధికారంలో వున్నా మీడియాను పూర్తిగా తమ చెప్పుచేతల్లోకి తీసుకొనేందుకు ప్రయత్నిచడం కొనసాగుతున్నది. లొంగని వాటి ఆర్థిక మూలాలను దెబ్బ తీసేందుకు, తద్వారా వాటి మూతకు ప్రయతాలు జరుగడం నిత్య కృత్యమే. మీడియా స్వేచ్ఛకు కలుగుతున్న హాని గురించి ఒక్క మాట కూడా రాయలేని నిస్సహాయ సంపాదకులను నేడు మనం చూస్తున్నాం. ఫోర్త్ ఎస్టేట్‌గా మన్ననలను పొందిన మీడియా రియలెస్టేట్‌గా మారిపోయిందనే ఆరోపణలు నిత్యం వినాల్సి వస్తోంది. మీడియా యజమానులు, రాజకీయ నేతలకు మధ్య వున్న గీత దాదాపుగా చెరిగిపోయింది. ఒకరి ప్రయోజనాలను ఇంకొకరు కాపాడు కుంటున్నారు. కొందరు రాజకీయ నేతలు స్వయంగా మీడియా సంస్థలను ఏర్పాటు చేసుకున్నారు. అధికారంలో వున్నపుడు దానిని అడ్డుపెట్టుకొని లాభాలు సంపాదించటం, ప్రతిపక్షంలో వున్నపుడు వాటినే పెట్టుబడిగా పెట్టి నిలుపుకోవటం గతంలో జరుగుతున్నదే. ఇప్పుడు రాజకీయ నేతలు, వారి కనుసన్నలలో మెలిగే మీడియా సంస్థలు ఎక్కడ అధికారం వుంటే ఆవైపే చేరటం రివాజుగా మారింది. దేశంలోని గుత్త పెట్టుబడిదారీ సంస్థలు మీడియా రంగంలో ప్రవేశించటంతో పత్రికా స్వేచ్ఛ హరించుకు పోతున్నది. పాలక పక్షాలు స్వార్థమే పరమార్థంగా వ్యవహరిస్తున్నా యన్నది స్పష్టం. గతంలో కాంగ్రెస్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి మీడియా వార్తలపై ప్రత్యక్ష సెన్సార్‌షిప్ విధించింది. ఇప్పుడు అదే కాంగ్రెస్ లేదా బిజెపి వాటితో జట్టుకట్టే పాలకవర్గ ప్రాంతీయ పార్టీలు మీడియా మీద పరోక్ష సెన్సార్‌ను అమలు జరుపు తున్నాయి. వారికి ఇష్టం లేని వార్త అసలు రాక పోవటం లేదా కనిపించీ కనిపించకుండా ఒక మూలన పడవేయటమో జరుగుతోంది. తమ విధానాలను ప్రశ్నించిన మీడియా సంస్థలకు ప్రకటనలు నిలిపి వేయటం, టీవీ ఛానల్స్ అయితే కేబుల్ నిర్వాహకులను బెదిరించి ఛానల్స్ ప్రసారాలను అడ్డు కోవటాన్ని చూస్తున్నాం. మన దేశంలో గత కొన్నేళ్లుగా కుహనా వార్తలు సామాజిక మాధ్యమాన్ని ముంచెత్తు తున్నాయి. నిజం మూడు అడుగులు వేసే లోగా అబద్ధం ముప్పై అడుగుల ముందు వుంటోంది. అవన్నీ ఒక పథకం ప్రకారమే వెలువడు తున్నాయి. ఏది నిజమో ఏది కాదో తెలుసుకోలేని గందరగోళంలో జనాన్ని పడ వేసేందుకు, నిజాన్ని కూడా ఒక పట్టాన నమ్మకుండా చేసేకుట్ర దీనిలో వుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో హిట్లర్ ప్రభుత్వంలో మంత్రిగా వున్న గోబెల్స్ ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజమై కూర్చుంటుంది అన్న సూత్రంతో పని చేశాడు. ఇప్పుడు మనిషి మనిషికీ ఇంటర్నెట్ అందుబాటులోకి రావటంతో గోబెల్స్‌లు వికటాట్టహాసం చేస్తున్నారు. వెనుకా ముందూ చూడకుండా వాట్సప్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ ఇతరుల మీద ఎత్తిపోస్తున్నారు. అవాస్తవాలు, వక్రీకరణలు ప్రచారం చేస్తూ, నకిలీలను నిజమైనవిగా చిత్రించటం మనకు నిత్యం అనుభవైక వేద్యమే. ప్రధాన స్రవంతి మీడియా సంస్థలు కూడా ఇందుకు తమవంతు తోడ్పాడును అందిస్తున్నాయి. అందువలన నిజమైన వార్తలు, నిజమైన పత్రికా, మీడియా స్వేచ్ఛ అంటే జనం కూడా గందర గోళానికి గురి అవుతున్నారు. మన దేశంలో 1956లో ఏర్పాటు చేసిన తొలి ప్రెస్ కమిషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబరు 16న ప్రెస్ కౌన్సిల్ ఏర్పడింది. ఆ రోజును జాతీయ పత్రికా దినంగా పాటిస్తూ 1997 నుంచి ప్రెస్ కౌన్సిల్ ప్రతి ఏటా కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. భారతదేశంలోనే కాకుండా చాలా ప్రపంచ దేశాలలో ప్రెస్ కౌన్సిళ్ళు ఉన్నాయి. అయితే భారతదేశ కౌన్సిల్‌కు ఉన్న ప్రత్యేకత, గుర్తింపు ఏమంటే ప్రభుత్వ శాఖలపై కూడా తన అధికారాన్ని వినియోగించే అవకాశం లభించడమే. స్వేచ్ఛాయుతమైన, జవాబుదారీ తనంతో కూడినదిగా మీడియా వుండాలనే లక్ష్యాన్ని ప్రకటించారు. ఆచరణలో స్వేచ్ఛను హరించే వారిని, అడ్డగోలుగా వ్యవహరించే మీడియా సంస్థలనూ సరైన దారిలో పెట్టటం దాని లక్ష్యం. లక్ష్య సాధనకు ప్రెస్ కౌన్సిల్ పూర్తిగా అంకితం కావాలని ఆశిద్దాం.

# సంపాదకీయం

## కొత్త పుంతలుతొక్కుతున్న అబద్ధాలు

నీ స్నేహితులను చూస్తే నువ్వెలాంటి వాడివో తెలుస్తుందన్నది ఒక లోకోక్తి. అనేక దేశాల నేతలు డోనాల్డ్ ట్రంప్ తమ జిగినీ దోస్తు అని చెప్పుకోవటం, చెట్టపట్టాల్ వేసుకొని తిరగటం తెలిసిందే. ట్రంప్ దాదాపు ప్రతి రోజూ ఎక్కడో అక్కడ మీడియాతో మాట్లాడితే, నోరు విప్పేది లేదని మోడీ భీషణ ప్రతిజ్ఞ చేసినట్టు వ్యవహరిస్తారు! ట్రంప్ పచ్చి అబద్ధాల కోరు అని చైనా తాజాగా చెబుతోంది, ఒక్క చైనాయే కాదు, అమెరికా మీడియా సైతం గతంలోనూ ఇప్పుడూ అదే చెబుతోంది. రోజూ ఎన్ని అసత్యాలు, తప్పుడు సమాచారం చెబుతున్నదీ లెక్కలు తీయటం ఒక పనిగా మారింది. తాజా అబద్ధం ఏమిటంటే చైనా అధ్యక్షుడు తనతో మాట్లాడినట్లు ట్రంప్ చెప్పాడు. ఎప్పుడు అంటే అవన్నీ మీకెందుకు మూడు నాలుగు వారాల్లో పన్నుల మీద అమెరికా ఒప్పందం చేసుకుంటుంది అన్నాడు. పన్నుల నుంచి వెనక్కు తగ్గుతున్నట్లు చైనా సంకేతం పంపింది, పూర్తి విజయం నాదే అని కూడా చెప్పుకున్నాడు. పన్నుల గురించి అమెరికాతో ఎలాంటి సంప్రదింపులు, చర్చలు జరగటం లేదని చైనా విదేశాంగ, వాణిజ్య మంత్రిత్వ శాఖలు స్పష్టం చేశాయి. అమెరికా ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని విమర్శించాయి. ఇక ట్రంప్ అసత్యాలు, వక్రీకరణల విషయానికి వస్తే రెండోసారి పదవీ స్వీకారం చేసిన రోజే 20 అబద్ధాలు చెప్పినట్లు మీడియా విశ్లేషించింది. తొలి నాలుగేళ్ల పదవీ కాలంలో 30,573 అబద్ధాలు చెప్పినట్లు వాషింగ్టన్ పోస్టు పత్రిక వెల్లడించింది. తొలి వంద రోజుల్లోనే 492 అబద్ధాలు, 2020లో ఓటింగ్‌కు ముందు నవంబరు రెండవ తేదీన ఒక్క రోజే 503 అవాస్తవాలు చెప్పి ఓటర్లను ఆకట్టుకొనేందుకు చూసినట్లు ఆ పత్రిక పేర్కొన్నది. నిజంగా ఒక రాజకీయ నేత అలా మాట్లాడతారా అన్న అనుమానం ఉంటే ట్రంప్, అతగాడి స్నేహితులను చూడాల్సిందే. ట్రంప్ నోటి నుంచి సగటున రోజుకు 21 తప్పుడు సమాచారం లేదా అబద్ధాలు వెలువడినట్లు తేలింది. తొలి ఏడాదిలో రోజుకు సగటున ఆరు, రెండో ఏడాది 14, మూడో ఏడు 22, నాలుగో సంవత్సరం 39 చొప్పున, అంటే పదవీ కాలం ముగిసే వ్యవధి దగ్గరపడిన కొద్దీ అబద్ధాలు పెరిగాయి. న్యూయార్క్ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం సంస్థ ఏకంగా ట్రంప్ అబద్ధాల సమాచార కేంద్రాన్నే ఏర్పాటు చేసింది. రెండోసారి తొలి రోజే రెండు ప్రసంగాలలో 20 అబద్ధాలతో ప్రారంభం అయిన తీరు చూస్తే నాలుగేళ్లలో గత రికార్డును బద్దలు కొట్టేందుకు ఎంతో కాలం పట్టదనిపిస్తోంది. ఒక ప్రధానిగా నరేంద్ర మోడీ అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎవరికైనా అభినందనలు తెలపటం ఒక సంప్రదాయం, కానీ అబద్ధాల కోరు ట్రంప్‌ను నా స్నేహితుడు అంటూ మోడీ సందేశాలు పంపారు. వివిధ సందర్భాలలో వర్ణించారు కూడా. రాజకీయాల పుట్టుకతోనే అబద్ధాలు కూడా వెంట వచ్చాయిగానీ ఇటీవలి కాలంలో కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎవరు అవునన్నా కాదన్నా వాటికి డోనాల్డ్ ట్రంప్, అతగాడి బాటలో నడిచే వారు నిష్ణాతులుగా మారారు. అతగాడిని చూసి ఉత్తేజం, ఉత్సాహం పొంది ప్రపంచంలో అనేక దేశాల అధ్యక్షులు లేదా ప్రధానులు కూడా సిగ్గూ ఎగ్గూ లేకుండా అవాస్తవాలు, అసత్యాలు, వక్రీకరణలకు పాల్పడుతున్నట్లు కనిపిస్తోంది. రాజకీయ నాయకుడంటే ఒపీనియన్స్ (అభిప్రాయాలు) మారుస్తూ ఉండాలని గురజాడ చురక అంటించారు. ఆయనే ఇప్పుడు బతికి ఉంటే అబద్ధాలు చెప్పని వాడు రాజకీయ నేత కానే కాడని గిరీశం చేత చెప్పించి ఉండేవారు. జర్నలిస్టులు వార్తలను సేకరించే పనిలో భాగంగా నేతల మాటల్లో అబద్ధాలు ఎన్ని ఉన్నాయో ఎత్తి చూపే పని భారం వారి మీద పడిందంటే అతిశయోక్తి కాదు. ఫ్యాక్ట్ చెక్ పేరుతో కొన్ని సంస్థలు ప్రత్యేకంగా సిబ్బందినే నియమించాయి. ట్రంప్ రెండవసారి జనవరి 20న పదవిని చేపట్టి వందవ రోజు పూర్తి చేసుకొనేందుకు ముందుకు పోతున్నాడు. ఈ లోగానే మీడియాను అణచివేసేందుకు కూడా పూనుకున్నాడు. సరిహద్దులు లేని రిపోర్టర్లు అనే సంస్థ పత్రికా స్వేచ్ఛ మీద రాజ్యాంగేతర దాడి ఎలా జరుగుతున్నదో వివరించింది. ఆరోగ్యం, నేరాల వంటి సమాచారం తెలుసుకొనేందుకు వీలు కల్పించే ప్రభుత్వ సంస్థల వెబ్‌సైట్ల నుంచి ఎనిమిదివేల పేజీలను ప్రభుత్వం తొలగించింది. జనాలు, మీడియాకు సమాచారం అందకుండా చేయటం తప్ప ఇది మరొకటి కాదు. ప్రభుత్వం నిర్వహించే 180 రేడియో స్టేషన్లను మూసివేసేందుకు గాను వాటికి అందచేస్తున్న 110 కోట్ల డాలర్ల నిధులు నిలిపివేయాలని పార్లమెంట్‌ను కోరాడు. దీనివలన గ్రామీణ, సుదూర ప్రాంతాల వారికి వాటి సేవలు నిలిచిపోతాయి. ప్రభుత్వ రంగంలోని మీడియాకు ప్రతి ఏటా సగటున ఒక పౌరుడు చెల్లిస్తున్న మొత్తం కేవలం 1.6 డాలర్లు మాత్రమే. ఫిబ్రవరి 11వ తేదీ నుంచి అధ్యక్ష భవన వార్తలను సేకరించకుండా అసోసియేటెడ్ ప్రెస్(ఏపి) సంస్థ విలేకర్లను నిషేధించారు. మెక్సికో గల్ఫ్ పేరును అమెరికా గల్ఫ్ అని మార్చినప్పటికీ ఆ సంస్థ తన వార్తలో పాత పేరునే వినియోగిస్తుండటమే దీనికి కారణం. ఏప్రిల్ 9న ఒక కోర్టు ఈ నిషేధం ఎత్తివేయాలని ఆదేశించినప్పటికీ ఖాతరు చేయటం లేదు. తన స్వంత సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారా 64 సార్లు మీడియా మీద అవమానకరమైన వ్యాఖ్యలు చేశాడు. 2021 జనవరి ఆరున కాపిటోల్ వద్ద జర్నలిస్టులపై దాడి చేసిన కేసులో శిక్షలు పడిన తన అనుచరులైన 13 మంది గూండాలను క్షమాభిక్ష పేరుతో విడుదల చేశాడు. మీడియా సంస్థలను వేధించేందుకు ఆరు కంపెనీలపై విచారణకు ఆదేశించాడు. ప్రాజెక్టు 2025 పేరుతో ట్రంప్ ఎజెండాకు రూపకల్పన చేసిన బ్రెండన్ కార్, మీడియా నియంత్రణ కమిషన్ చైర్మన్‌ను చేసిన తరువాత ట్రంప్ గురించి విమర్శనాత్మక వార్తలను అందించే సిబిఎస్, ఎబిసి, ఎన్‌బిసి, ఎన్‌పిఆర్, పిబిఎస్, కాలిఫోర్నియా టెలివిజన్‌లపై విచారణ పేరుతో వేధింపులకు పూనుకున్నాడు. నాలుగు సంస్థలపై ట్రంప్ వ్యక్తిగతంగా పరువునష్టం కేసులు వేశాడు. ఇక కమ్యూనిజానికి, తమను వ్యతిరేకించే దేశాల గురించి తప్పుడు ప్రచారం చేసేందుకు అమెరికా ప్రభుత్వం యుఎస్ ఏజన్సీ ఫర్ గ్లోబల్ మీడియా అనే సంస్థను దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసింది. తరువాత మీడియా పెద్ద ఎత్తున విస్తరించి అలాంటి ప్రచారం చేసేందుకు వాటితో పెద్దగా అవసరం లేకపోయింది. అందుకే అది నిర్వహించే రేడియో, టీవీ సేవలను నిలిపివేయాలని ప్రభుత్వం నిధులను నిలిపివేసింది. విలేకర్లను సెలవుపై వెళ్లాలని కోరారు. ఈ సంస్థ ద్వారా నిర్వహించే వాయిస్ ఆఫ్ అమెరికా, రేడియో ఫ్రీ ఆసియా, యూరోప్ లిబర్టీ వంటి వాటిలో కమ్యూనిస్టు, ప్రజాస్వామ్య వ్యతిరేక వార్తలను ప్రచారం చేస్తున్నారు. అవి ఎంతగా రెచ్చగొట్టినా అమెరికా పాలక వర్గానికి వచ్చిన మేలేమీ లేకపోవటంతో ట్రంప్ వాటికి నిధులు నిలిపివేశాడు. ఈ చర్య వలన మూడున్నర వేల మందికి పైగా జర్నలిస్టులు, ఇతర సిబ్బంది ఉపాధి కోల్పోనున్నారు. ఈ సంస్థలలో పని చేస్తూ తప్పుడు వార్తలను ప్రచారం చేసిన జర్నలిస్టులలో విదేశాలకు చెందిన 84 మందిని స్వదేశాలకు పంపాలని నిర్ణయించింది. అయితే వారిలో అనేక మందిని ఆయా దేశాలు కేసులు పెట్టి జైలు పాలు చేసే అవకాశం ఉందట. కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం చేసేందుకు వివిధ దేశాలలో ప్రైవేటు టీవీలు, పత్రికలకు, కొందరు జర్నలిస్టులకు సిఐఏ, ఇతర సంస్థల ద్వారా పెద్ద ఎత్తున నిధులు అందచేస్తున్న సంగతి

# బూదరాజు సేవలు చిరస్మరణీయం

తెలుగు భాషకు తన జీవనాన్ని అంకితంగా సమర్పించుకున్న వారు అరుదు. వారిలో బూదరాజు రాధాకృష్ణ ప్రముఖులు. వాక్ నిపుణత, వ్యాకరణ విలాసం, పదబంధాల పరిపుష్టతతో కూడిన ఆయన రచనలు పరిశుద్ధమైన భాషా సేవకు నిలువెత్తు నిదర్శనాలు. 'తెలుగు భాషా భక్తుడు' అనే పదం ఆయనకు అక్షరార్థంగా అంకితమవుతుంది. బూదరాజు రాధాకృష్ణ తెలుగు సాహితీ ప్రపంచంలో ఒక విశిష్టమైన వ్యక్తి. వారు కేవలం ఒక భాషా శాస్త్రవేత్తగానే కాకుండా, సీనియర్ పాత్రికేయులుగా, రచయితగా, అనువాదకుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. తెలుగు భాషకు, పాత్రికేయ రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవి. తెలుగు సాహితీ సముద్రంలో ఎన్నో మాణిక్యాలు వెలుగుతూనే ఉన్నాయి. అటువంటి అమూల్య వెలుగులు ప్రసాదించిన మణి మాణిక్యాలలో ఒకరు బూదరాజు రాధాకృష్ణ. భాషపై అపారమైన ప్రేమ, పరిశోధనా దృక్పథం, పాత్రికేయ శ్రద్ధ, రచనా నైపుణ్యంఈ నాలుగు మణిపూసలతో ఆయన నిర్మించిన జీవన మార్గం తెలుగు భాషాభిమానులకు మార్గదర్శిగా నిలిచింది. బూదరాజు రాధాకృష్ణ 1932 మే 3న ప్రకాశం జిల్లా వేటపాలెం గ్రామంలో జన్మించారు. ప్రాథమిక విద్య చీరాలలో, ఉన్నత విద్య విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో సాగింది. భాషపై ఆసక్తితో "%ఎఅర్‌శీతీఅఝశ్రీ +తీఝఎఝతీ శీట ఝతీశ్రీఎ ఎవశ్రీబస్త్రబ ×అంఎతీఅజ్ఞ్అశీఅం%" అనే విషయంపై 1965లో డాక్టరేట్ పొందారు. ఇది ఆంధ్ర విశ్వవిద్యాలయం అందించిన భాషా అధ్యయనానికి చెందిన అపూర్వ కీర్తిగా గుర్తించబడింది. చీరాల వి.ఆర్.ఎస్. కళాశాలలో తెలుగు అధ్యాపకునిగా తన ఉపాధ్యాయ జీవితం ప్రారంభించిన రాధాకృష్ణ , తర్వాత తెలుగు అకాడమీలో డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. భాషా ప్రామాణికతకు తోడ్పడే అనేక పుస్తకాలను ఈ సమయంలో సమీకరించారు. 1988లో పదవీ విరమణ చేసిన తర్వాత కూడా ఆయన సేవా ధర్మం ముగిసి పోలేదుకావలసిన చోటా, అవసరమైన సమయంలో రచన ద్వారా ఆయన శబ్దజీవితమై మిగిలారు. పదవీ విరమణ అనంతరం "ఈనాడు" జర్నలిజం సంస్థ లో ప్రాచార్యులుగా పదేళ్ల పాటు సేవలందించారు. ఎంతోమంది యువ పాత్రికేయులకు భాషా శాస్త్రం, రచనా వ్యాకరణం బోధించి, వారిని సామాజిక పరిణతితో కూడిన రచయితలుగా తీర్చిదిద్దారు. "పుణ్యభూమి" శీర్షికతో 'సి. ధర్మారావు' కలం పేరుతో వందలాది వ్యాసాలు రాసారు. భాషా విలువ, సంస్కృతి పరంపర, చరిత్ర సంక్రమణ, సమకాలీన సమీక్ష వంటి అనేక అంశాలు ఆయన వ్యాసాల్లో పదునైన పరిశీలనతో కూడుకున్నవి. ఈ వ్యాసాలు ప్రజలలో



పాఠనాభిరుచి పెంచేలా, ఆలోచనలను పెంచేలా ఉండేవి. తెలుగు భాషా శాస్త్ర పరిశోధనకు బూదరాజు కృషి విలువైనదిగా గుర్తించ బడింది. "వాస్తు పదకోశం", "వ్యవహార కోశం", "తెలుగు దినపత్రికల భాష" వంటి ప్రామాణిక రచనలు ఆయన మేధస్సుకు నిదర్శనాలు. నన్నయ పూర్వకాలపు శాసన భాషను అధ్యయనం చేసి, మాండలికాల వ్యాప్తిపై చేసిన విశ్లేషణ భాషా పరిశోధకులకు గొప్ప వనరుగా నిలిచింది. వ్యాకరణ నియమాలు, వినియోగ నిబంధనలు, భాషా అభివృద్ధిలో సమాజ పాత్ర వంటి అంశాలపై ఆయన వ్యాఖ్యానాలు అత్యంత విలువైనవిగా భావించ బడుతున్నాయి. రాధాకృష్ణ రచయితగా తెలుగుని ప్రభావవంతమైన భావ ప్రకటనకు ఒక పటిష్ఠమైన రూపకర్త. పాత్రికేయులకు మార్గదర్శకంగా "రచన రీతులు", "తెలుగుబడి" వంటి పుస్తకాలు రచించారు. మహాకవి శ్రీశ్రీ జీవితాన్ని ఆంగ్లంలో రచించి, స్వయంగా తెలుగులోకి అనువదించారు. "మరవ రాని మాటలు" అనే గ్రంథంలో తెలుగు సాహిత్యంలోని అమూల్య సూక్తులను సంకలనం చేశారు. అంతేకాక, నోమ్ చాంస్కీ, కార్ల్ మార్క్స్, గుల్జార్ వంటి రచయితల రచనలను తెలుగులోకి అనువదించి భావానువాదానికి అర్థవంతమైన ప్రమాణాలు నెలకొల్పారు. జ్ఞానం, వినయం, మిత భాషణం, శ్రద్ధ అనే నాలుగు గుణాలతో ఆయన మానవీయత వెలిసింది. నుకల నారాయణ, కాళోజీ నారాయణరావు, న్యాపతి సుబ్బారావు వంటి ప్రముఖులతో ఉన్న సన్నిహిత సంబంధాలు ఆయన సమాజాభిముఖ దృక్పథానికి ప్రతీకలుగా నిలిచాయి. విశేషమైన విషయ పరిపక్వత, పదాలను నాణ్యంగా ఉపయోగించే నైపుణ్యం ఆయన రచనలకు స్ఫూర్తినిచ్చాయి. బూదరాజు రాధాకృష్ణ జీవితం తెలుగు భాషకు అంకితమై, పరిశోధనతో నిండి, శ్రద్ధతో నడిచిన ఆత్మసాక్షాత్కార యాత్ర. ఆయన రచనలు నేటికీ తెలుగు అధ్యాపకులకు, పాత్రికేయులకు, తర్జుమకారులకు మార్గదర్శిగా నిలుస్తున్నాయి. తెలుగు భాషే తన ముక్తిపథం అని నమ్మి జీవితాంతం అదే వైపు నడిచిన బూదరాజు రాధాకృష్ణ , సాహిత్యాన్ని మానవీకరించిన సాహితీ వేత్త గానే నిలిచారు. ఆయన రచనలు భాషానురాగులకు ఆదర్శంగా, పాత్రికేయులకు పాఠశాలలా నిలిచాయి. తెలుగు భాషా పట్ల ఆయన కలిగిన భక్తిసజీవంగా శబ్దంలో, వాక్యంలో, వ్యాసంలోఇప్పటికీ స్పందిస్తోంది.

# ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలి

## భూసేకరణ భూముల వివరాలు అప్‌డేట్ చేయాలి

## జిల్లాలో ఒక్క మండలాన్నిపైలట్‌గా రెవెన్యూ సదస్సులు

## అర్హులకు ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు కేటాయించాలి

## రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి







పెద్దపల్లి

భూ భారతి చట్టం రూల్స్ ప్రకారం ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, సిసిఎల్ఏ కమీషనర్ నవీన్ మిట్టల్ లతో కలిసి భూ భారతి చట్టం రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణుతో కలిసి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మే 5 నుంచి మే 20 వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లాలలో ఒక మండలాన్ని పైలట్ గా తీసుకొని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యల పై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలని మంత్రి సూచించారు. జూన్ 2 వరకు పైలట్ ప్రాజెక్ట్ క్రింద వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి కృషి చేయాలని మంత్రి తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 4 మండలాల్లో రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పై ప్రజల నుంచి 12 వేల 759 దరఖాస్తులు వచ్చాయని అన్నారు. భవిష్యత్తులో జరిగే రాష్ట్రవ్యాప్త రెవెన్యూ సదస్సులు సుమారు 15 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని అన్నారు. భూ భారతి చట్టంలో దరఖాస్తు చేసుకునే సమయంలో సరిగ్గా దరఖాస్తు నమోదు అయ్యేలా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని అన్నారు. ప్రభుత్వ భూములలో పొజిషన్ ఉన్న రైతుల దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని, భూమి లేని నిరుపేదలు పోజిషన్ లో ఉంటే వారికి పట్టాలు ఇచ్చేందుకు ముఖ్యమంత్రితో చర్చించి సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని మంత్రి తెలిపారు. పట్టాలు ఉండి పొజిషన్ లో లేని దరఖాస్తులను కూడా పరిశీలించాలని అన్నారు. హై కోర్టు నుంచి అనుమతి రాగానే సాధా బైనామా దరఖాస్తులు పరిష్కారం చేయాలని, దీనికి అవసరమైన కార్యాచరణ పూర్తి చేయాలని మంత్రి సూచించారు. భూ సర్వే కు సంబంధించిన సమస్యలు, ఆర్.ఎస్.ఆర్ ఎక్సస్ సమస్యలు పరిష్కరించాలని, భూ సేకరణ కింద ప్రభుత్వం సేకరించిన భూముల రికార్డులు అప్ డేట్ చేయాలని మంత్రి కలెక్టర్ లను ఆదేశించారు. మే నెల చివరి వరకు రెవెన్యూ సదస్సులు వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలని మంత్రి పేర్కొన్నారు.గతంలో పంపిణీ చేసిన అసైన్డ్ భూముల పట్టాలు ఎవరైనా విక్రయిస్తే ముందు ఆ పట్టాలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు చేసిన వారు భూమి లేని నిరుపేద లైతే ప్రభుత్వం చర్చించి ఎంత భూమి క్రమబద్ధీకరించాలి అనే అంశంపై నిర్ణయం తీసుకుంటామని అన్నారు. అటవీ భూముల వివాదాల పరిష్కారానికి కూడా కృషి చేయాలని అన్నారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా జిల్లా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు త్రాగు నీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ, ఓఆర్ఎస్ ప్యాకేట్లతో చిన్న మెడికల్ క్యాంపు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చూసుకోవాలని అన్నారు. సీసీ కెమెరాలు, అవసరమైన మేర పోలీస్ భద్రత కల్పించాలని అన్నారు.ప్రశ్న పత్రాలు స్టోర్ చేసే స్ట్రాంగ్ రూం వద్ద సిసిటివి ఉండాలని, పోలీస్ బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నా పత్రాలను తరలించాలని అన్నారు. పరీక్ష కేంద్రాల గేటు మధ్యాహ్నం 1.30 గంటలకు మూసి వేయాలని, ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా చెక్ చేసిన తర్వాత మాత్రమే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించాలని, బయో మెట్రిక్ అటెండెన్స్ అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అర్బన్ పీఎం ఆవాస్ యోజన కింద లక్షా 13 వేల ఇండ్లు మంజూరయ్యాయని, ప్రతి నియోజకవర్గ పరిధిలోని పట్టణ ప్రాంతాలలో కనీసం 500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా చూడాలని మంత్రి అన్నారు. పి.ఎం.ఎల్.ఏ పోర్టల్ లో లబ్ధిదారుల ధ్రువీకరణ ఆధార్ నెంబర్ లతో పూర్తి చేయాలని, దీని ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి మనకు మొదటి విడత కింద 700 కోట్ల పైగా నిధులు వస్తాయని అన్నారు. 600 చదరపు ఫీట్లు కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మిస్తే మనకు ప్రభుత్వం నిధులు రావని, లబ్ధిదారులకు వివరించి 600 ఫీట్ల లోపు కట్టేలా చూడాలని అన్నారు.

పైలెట్ గ్రామాలలో మంజూరు చేసిన 51 వేల ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటివరకు 10 వేల ఇంటి నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయని, 2019 ఇండ్లు బేస్మెంట్ పూర్తి చేసుకుంటే ఇటీవలే లక్ష రూపాయలు విడుదల చేశామని, ఇంటి నిర్మాణాలలో పురోగతి రావాల్సిందేనని, కలెక్టర్లు హౌసింగ్ శాఖపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. హౌసింగ్ కోసం ప్రత్యేకంగా ప్రతి మండలానికి అసిస్టెంట్ ఇంజనీర్లను ప్రభుత్వం కేటాయిస్తుందని అన్నారు. ప్రతిరోజు ఇంచార్జి మంత్రులతో సమన్వయం చేస్తూ అర్హుల జాబితా ప్రకటించి ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించాలని, మే 10వ తారీఖు లోపు పూర్తి స్థాయిలో ఇండ్లు గ్రౌండ్ చేయాలని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్ లో నమోదు చేయాలని, ప్రజలకు చెల్లింపులు సకాలంలో అందుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెద్దపెల్లి జిల్లాలో ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ సంబంధించి ధర్మారం మండలంలో 650 ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక ఎంపిక చేసి ఇంచార్జ్ మంత్రి కి ప్రతిపాదనలు పంపుతామని అన్నారు. పెద్దపల్లి ,రామగుండం ,మంథని అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో స్థానిక ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ 2,3 రోజులలో లబ్దిదారుల తుది ధృవీకరణ పూర్తి చేస్తామని అన్నారు. అర్హుల జాబితాను ఇంచార్జి మంత్రి ద్వారా ఆమోదింప జేసుకొని లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ చర్యలు చేపడతామని అన్నారు. ఈ వీడియో సమావేశంలో ఆర్డీఓలు బి.గంగయ్య, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్, తహసిల్దార్, కలెక్టరేట్ పర్యవేక్షకులు, రెవెన్యూ సిబ్బంది, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు బుట్టా గుడ్ బై

కర్నూలు

వ్యాపార రంగంలో ఉన్నవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. పారిశ్రామిక, వ్యాపార రంగాల నుంచి రాజకీయాల వైపు వచ్చినవారు చాలా అప్రమత్తంగా ఉంటారు. పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటారు. లేకుంటే ఇబ్బందులు తప్పవని వారికి తెలుసు. అయితే ఈ విషయంలో మూల్యం చెల్లించుకున్నారు మాజీ ఎంపీ బుట్టా రేణుక. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన రేణుక 2014 ఎన్నికల్లో కర్నూలు ఎంపీగా గెలిచారు. అత్యంత సీనియర్ నేతగా ఉన్న కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి ని ఓడించి లోక్ సభలో అడుగుపెట్టారు. అటు తరువాత రాజకీయంగా తీసుకున్న నిర్ణయాలు ఆమె పాలిట శాపంగా మారాయి.2014లో రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సైతం గౌరవప్రదమైన స్థానాలను తెచ్చుకొని ప్రతిపక్షంగా ఉంది. బుట్టా రేణుక ఎంపీగా గెలిచి పార్లమెంట్లో అడుగుపెట్టారు. విద్యాధికురాలిగా, వ్యాపారవేత్తగా బహుముఖంగా గుర్తింపు పొందారు రేణుక. అయితే 2018లో ఆమె టిడిపిలో చేరాలని నిర్ణయించుకున్నారు. అక్కడ నుంచి ఆమె కౌంట్ డౌన్ మొదలైంది. తెలుగుదేశం పార్టీలో చేరినా.. ఆమెకు కోరుకున్న సీటు దక్కలేదు. కనీసం ఎక్కడా సర్దుబాటు కూడా చేయలేదు. దీంతో టీడీపీలోకి వచ్చినట్టే వచ్చి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి తిరిగి వెళ్ళిపోయారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకొనసాగి ఉంటే 2019లో సైతం ఆమెకే కర్నూలు పార్లమెంట్ టికెట్ ఇచ్చేవారు. టిడిపిలోకి వెళ్లి తిరిగి రావడంతో ఆమెకు టికెట్ నిరాకరించారు జగన్మోహన్ రెడ్డి. 2019 నుంచి 2024 మధ్య ఆమె పార్టీకి తన సమయాన్ని కేటాయించాల్సి వచ్చింది. అయితే అధినేతను ఎలాగోలా ఒప్పించి 2019లో ఎమ్మిగనూరు అసెంబ్లీ టికెట్ ఇప్పించుకున్నారు రేణుక. సిట్టింగ్ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని తప్పించి మరి జగన్ ఆమెకు టికెట్ ఇచ్చారు. బీసీ తారక మంత్రం పనిచేస్తుందని భావించారు. కానీ కూటమి ప్రభంజనంలో బుట్టా రేణుక ఓడిపోయారు.అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి రూపంలో ఆమెకు వ్యతిరేక వర్గం ఉంది. మొన్నటి ఎన్నికల్లో ఆ వర్గం వ్యతిరేకించింది. ప్రస్తుతం కూడా వ్యతిరేకిస్తూనే ఉంది. ఇంకోవైపు వ్యాపారంలో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆమె ఆస్తులు వేలానికి సిద్ధంగా ఉన్నాయి. అటు రాజకీయంగా కలిసి రాక.. ఇటు వ్యాపార పరంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది.

## బొబ్బిలి యుద్ధంలో నెగ్గిన కూటమి

విజయనగరం

విజయనగరం జిల్లా బొబ్బిలి మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్నారు కూటమి నేతలు. అందుకోసం పెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని నెగ్గించుకున్నారు. ఎలాగైనా మున్సిపల్ పీఠం దక్కించుకోవాలని కూటమి నేతలు, తమ పీఠాన్ని పదిలపరచుకోవాలని వైసీపీ నేతలు ఎవరికి వారే పక్కా స్కెచ్ తో క్యాంప్ పొలిటికల్స్‌కి తెరలేపినా చివరికి కూటమి నేతలే నెగ్గారు. ఈ అంశంతో విజయనగరం జిల్లా రాజకీయాలు ఒక్కసారిగా రసవత్తరంగా మారాయి.నాలుగేళ్ల క్రితం వైసీపీ దక్కించుకున్న బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ పదవిని ఇప్పుడు అధికార కూటమి దక్కించుకునేందుకు పక్కా ప్రణాళిక రూపొందించుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీపై ఎలాగైనా తమ జెండా ఎగురవేయాలని కూటమి చేసిన ప్రయత్నం సక్సెస్ ఫుల్ గా నెరవేరింది. అవిశ్వాసానికి కావలసిన మ్యాజిక్ ఫిగర్ ను సొంతం చేసుకునేందుకు ముందుగానే వైసీపీ కౌన్సిలర్లను తమ వైపు తిప్పుకుంది. బొబ్బిలి మున్సిపాలిటీలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు ఉండగా, అవిశ్వాస తీర్మానంలో చైర్మన్ కు వ్యతిరేకంగా 20 మంది ఓటేస్తే వైసీపీ చైర్మన్ పదవి కోల్పోయే అవకాశం ఉంది. అనంతరం 16 మంది చేతులెత్తి కొత్త చైర్మన్ ను ఎన్నుకోవడానికి అవకాశం ఉంటుంది.బొబ్బిలి మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 31 వార్డులుండగా, వాటిలో పది వార్డులను టీడీపీ, 20 వైసీపీ, ఒక వార్డు ఇండిపెండెంట్ కైవసం చేసుకున్నారు. అయితే ఆ తరువాత ఒక వైసీపీ సభ్యుడు రాజీనామా చేయడంతో బొబ్బిలిలో మొత్తం 30 మంది కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో ఇండిపెండెంట్ తోపాటు మరో 9 మంది వైసీపీ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. దీంతో టీడీపీ బలం 20కి చేరింది. ఎమ్మెల్యే బేబీనాయన ఎక్స్ అఫిషియో మెంబర్ గా ఓటు హక్కు ఉండటంతో అవిశ్వాసం తీర్మానం నెగ్గటానికి ఎలాంటి ఢోకా లేదు. అవిశ్వాసానికి కావలసిన 20 మంది కౌన్సిలర్లు కూటమికి ఉండటంతో ఓటింగ్ సమయానికి వారిలో ఏ ఒక్కరు చేజారిపోకుండా క్యాంప్ పాలిటిక్స్ కి తెరలేపారు కూటమి నేతలు. వైసీపీ నుండి మద్దతు ఇస్తున్న తొమ్మిది మంది, ఒక ఇండిపెండెంట్ తోపాటు టీడీపీకి చెందిన10 మంది కౌన్సిలర్లను క్యాంప్‌లో ఉంచి నేరుగా ప్రత్యేక బస్సులో బొబ్బిలి మున్సిపల్ సమావేశ మందిరంకి తీసుకువచ్చారు. అయితే ఈ అవిశ్వాస తీర్మానంకు వైసీపీకి చెందిన మిగిలిన పది మంది కౌన్సిలర్లు కూడా హాజరయ్యారు. ఇక మునిసిపల్ సమావేశం ప్రారంభమైన తరువాత అవిశ్వాస తీర్మానం ప్రారంభించారు

## బీసీల పోరాటంతోనే కేంద్రం దిగొచ్చింది...

- బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డా.చంద్రమోహన్

మంచిర్యాల



జనగణనలో కులగణన చేపట్టాలని బీసీల పోరాటంతోనే కేంద్రం దిగివచ్చిందని బీసీ సంక్షేమ సంఘంజిల్లా అధ్యక్షుడు డా. చంద్రమోహన్ గౌడ్ అన్నారు. జాతి జనగణనలో సమగ్ర కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని ఎప్రిల్ 2 న ఢిల్లీలో చేసిన బీసీలు ధర్నా చేయడం, ఇందులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనడంతో కేంద్రం దిగి వచ్చిందన్నారు. తెలంగాణ, బీహార్ రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కులగణన చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం పై మరింత వత్తిడి పెరిగినట్లు ఆయన తెలిపారు. బీసీల ఐక్యతతో చేసిన పోరాటం ఫలితంగానే కేంద్రం దిగి వచ్చిందని, ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ గొప్ప నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు. సామజిక రిజర్వేషన్ల పై విధించిన 50శాతం పరిమితిని ఎత్తివేసి, తెలంగాణలో 42శాతం, బీహార్ లో 65శాతం రిజర్వేషన్లకు కేంద్రం ఆమొందించాలని ఆయన అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన మొదలు పెట్టి, బీసీ రిజర్వేషన్లు జనాభా ధమాషా ప్రకారం పెంచే వరకు దేశ వ్యాప్తంగా బీసీల పోరాటాన్ని ఆపేదిలేదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## జీతాలు చెల్లించాలని డీఆర్డీఏ పీడీకి వినతి...




జగిత్యాల

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న తమకు గత నాలుగు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం జగిత్యాల డీఆర్డీఏ పిడి రఘువరణ్ కు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ప్రతి రోజు జాబ్ కార్డు కలిగిన కూలీలను ఉపాధి పనులకు తీసుకెళ్లి పనులు చేస్తూ, రికార్డులు రాస్తూ ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేయడానికి అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఎండకు, వానకు, చలిని భరిస్తూ గుట్టల్లో, చెరువుల్లో, కుంటల్లో బాధ్యతగా పనిచేయిస్తున్న తమ కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాగా వినతిపత్రం స్వీకరించిన పీడీ స్పందిస్తూ సంబంధిత కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళి త్వరలోనే వేతనాలు చెల్లించేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్లు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోన్నం రాజా గౌడ్, గోనపల్లి మహేష్ , లక్మన్, తిరుపతి , రేవతి , జగిత్యాల జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ కార్యవర్గం పాల్గొన్నారు.

## ఇందిరమ్మఇండ్ల లబ్దిదారుల తుది జాబితా రెడీ చేయాలి....

## - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి

ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల తుది జాబితా రెండు రోజులలో తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పాలకుర్తి, అంతర్గాం మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల ధృవీకరణపై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ మొదటి విడతల్లో పాలకుర్తి మండలానికి 594, అంతర్గాం మండలానికి 512 ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం కేటాయించిందని, ఇందిరమ్మ కమిటీల నుంచి సేకరించిన ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అన్నారు. రాబోయే రెండు రోజులలో ఇందిరమ్మ కమిటీలు అందించిన జాబితాను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు ప్రకారం అర్హులో కాదో తేల్చాలని, అనర్హులు ఎవరైనా ఉంటే జాబితా నుంచి తప్పనిసరిగా తొలగించాలని, 2 రోజులలో తుది లబ్ధిదారుల జాబితా తయారు చేయాలని అన్నారు. మండలాల్లో తుది లబ్ధిదారుల జాబితా సిద్ధం చేస్తే జిల్లా ఇంచార్జి మంత్రి ఆమోదం తీసుకొని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, వీటిని త్వరగా గ్రౌండ్ చేసుకుంటే వర్షాకాలం లోపు నిర్మాణ పనులు ప్రారంభించ వచ్చని అన్నారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రాజేశ్వర్, తాహసిల్దార్ జ్యోతి, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొంగర భాస్కరరావు ఆశయాన్ని నిలబెట్టారు

## పోచంపల్లి కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ ను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**భూదాన్ పోచంపల్లి, మే 02( ప్రభాత సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని తడక రమేష్ ఆధ్వర్యంలో కోపరేటివ్ అర్బన్ బ్యాంక్ ను భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ,యాదాద్రి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ హనుమంతరావు లతో కలిసి రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్ కోపరేటివ్ హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ...కేవలం వెయ్యి మందితో ఖాతాలను 6.50 లక్షలతో ప్రారంభించిన సహకార బ్యాంకు నేడు 400 కోట్ల తో లక్ష మంది ఖాతాలతో వెలసిల్లటం ఐక్యతకు, అంకిత భావానికి నిదర్శనమన్నారు. చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధించవచ్చు అని నిరూపించారు అన్నారు. కొంగర భాస్కరరావు ఆశయాన్ని నిలబెట్టారు అన్నారు. భూదాన్ ఉద్యమానికి పేరుందిన పోచంపల్లి ప్రాంతంలో ధాన్యం కూడా ఎక్కువగా పండుతుందన్నారు. చేనేత రంగాలను ప్రోత్సహించేందుకు 290 కోట్లు పొదుపు పథకం ద్వారా విడుదల చేయడం జరిగిందని 75 వేల నుండి 1.50 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందన్నారు. చేనేత వస్త్రాలు డూప్లికేట్ రాకుండా చర్యలు తీసుకుంటామ న్నారు విద్యాశాఖ మహిళా శిశు సంక్షేమ శాఖల ద్వారా యూనిఫామ్స్ మెటీరియల్ను కొనుగోలు చేయిస్తామన్నారు. భూదాన్ పోచం పల్లి మున్సిపాలిటీగా ఏర్పడడం యునెస్కో వారిచే హెరిటేజ్ గ్రామంగా గుర్తింపు తెచ్చుకోవడం ఈ ప్రాంతం నేతన్న నెలవుగా మారిందన్నారు. ఉత్పత్తులు మార్కెటింగ్ చేపించేందుకు ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేపిస్తామన్నారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... రైతులకు రుణాలు అందించేటప్పుడు బంధువులుగా చూస్తూ సొంత సంస్థగా నడిపించినప్పుడే సహకార సంఘాలు బలపడతాయన్నారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ చేనేత సంఘాలన్నీ కలిసి ఐక్యతతో నిలబడడం అభివృద్ధికి చిహ్నం అన్నారు.కొండ లక్ష్మణ్ బాపూజీ పేరిట నెలకొల్పిన అవార్డ్స్ కొనసాగిస్తామన్నారు ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి పరుస్తామన్నారు. రాష్ట్ర చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయర్ గారు మాట్లాడుతూ... పొదుపు పథకాలన్నీ అమల్లోకి తెస్తామన్నారు ఆర్డీలు కట్టిస్తా మన్నారు. ప్రతి చేనేత కార్మికుడికి 18 వేలు అనుబంధ కార్మికుడికి 6 వేలు జమ చేసే పద్ధతి వచ్చే నెల నుండి అమల్లోకి వస్తుందన్నారు. చేనేత వస్త్రాలైన బెడ్షీట్లు, టవల్స్, లుంగీలు మార్కెటింగ్ చేసేందుకు ప్రోత్సాహకరంగా షో రూమ్లను ఏర్పాటుచేసి విక్రయానికి చర్యలు తీసుకుంటా మన్నారు. అదే విధంగా టెక్స్టైల్స్ డిప్లమా కోర్సులో 60 మంది అభ్యసిస్తున్నారని తెలియజేశారు. గతంలో 57 సంవత్సరంల వారికే బీమావర్తించేదని, ప్రస్తుత ప్రభుత్వం వయసుతో నిమిత్తం లేకుండా వృద్ధులైన వారికి ఐదు లక్షల బీమా ను వర్తింప చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తడక వెంకటేశం, రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షుడు మురళి మదన్ గోపాల్ స్వామి, భువనగిరి మార్కెట్ చైర్మన్ రేఖ బాబురావు, ఆర్డీవో శేఖర్ రెడ్డి,చేనేత కార్మికులు,తదితరులు పాల్గొన్నారు.

# మాయం కానున్న మూసీ మురుగు

**హైదరాబాద్ :** మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని అరికట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం భారీ ప్రాజెక్టును చేపట్టింది. రూ. 3,100 కోట్లతో రెండు దశల్లో ట్రంక్ లైన్లు నిర్మించనున్నారు. 80 శాతం మురుగు మూసీలోకి చేరుతుండటంతో.. 39 అదనపు ఎస్టీపీలను నిర్మించనున్నారు. నిధుల సమీకరణకు ప్రయత్నిస్తున్నారు. ఉత్తరం, దక్షిణం వైపు ట్రంక్ లైన్ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం మూసీ నదిలోకి నేరుగా మురుగు నీరు వదలడం వల్ల శుద్ధి కేంద్రాల లక్ష్యం నెరవేరడం లేదు. ట్రంక్ లైన్లు నిర్మించడం ద్వారా మురుగు నీటిని సేకరించి.. శుద్ధి కేంద్రాలకు తరలించి, శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. హైదరాబాద్ నగరవాసులకు ఇబ్బందికరంగా మారిన మూసీ నది మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం నడుం బిగించింది. మూసీ నదిలోకి మురుగు ప్రవాహాన్ని పూర్తిగా నిలిపివేయాలనే లక్ష్యంతో మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ (ఎంఆర్డీసీఎల్) విస్తృత ప్రణాళికను సిద్ధం చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు.. మూసీ నదికి ఇరువైపులా భారీ మురుగు ట్రంక్ లైన్లను నిర్మించాలని నిర్ణయించారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును రెండు దశల్లో రూ. 3,100 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో జలమండలి ఇంజనీర్లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి.. మురుగు కలుస్తున్న ప్రాంతాలను గుర్తించి.. లోటుపాట్లను విశ్లేషించిన తర్వాత కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎంఆర్డీసీఎల్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలో రోజువారీగా ఉత్పత్తి అవుతున్న మురుగు నీటిలో 80 శాతం మూసీ నదిలోకి చేరుతోంది. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) మధ్యలో 55 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న నది పూర్తిగా మురుగుతో నిండిపోయింది.గతంలో జంట జలాశయాల



నుంచి నార్సింగి వరకు కొంతవరకు స్వచ్ఛమైన నీరు కనిపించేది. అయితే.. ఎగువ ప్రాంతాల్లో జనావాసాలు పెరగడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నార్సింగి నుంచి గౌరెల్లి వరకు నదికి ఇరువైపులా 45 కిలోమీటర్ల మేర 2,000 మిమీ నుంచి 2,600 మిమీ డయా పైపులైన్లతో మురుగును మళ్లించాలని గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రూ. 3,100 కోట్ల వ్యయంతో డీపీఆర్ కూడా సిద్ధమైంది. ఆ ప్రణాళికను ప్రస్తుత ప్రభుత్వం అమలు చేయాలని భావిస్తోంది.ప్రస్తుతం నగరంలో 52 మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్టీపీలు) ఉండగా.. సివరేజీ మాస్టర్ ప్లాన్ ప్రకారం మరో 39 ఎస్టీపీలు నిర్మించాల్సి ఉంది. ఈ ఎస్టీపీలను నిర్మించి, ట్రంక్ లైన్లకు అనుసంధానం చేయడం ద్వారా శుద్ధి చేసిన నీటిని మాత్రమే నదిలోకి వదులుతారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణపై ఎంఆర్డీసీఎల్ దృష్టి సారించింది. పర్యావరణానికి కలిగే ప్రయోజనాలను వివరిస్తూ నిధుల కోసం దరఖాస్తు చేశారు. త్వరలో సానుకూల నిర్ణయం వస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నీట్ 2025 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదు

**సిద్దిపేట :** 4వ తేదీన జిల్లాలో నిర్వహించే యూజీ నీట్ 2025 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఏలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకురాకూడదని జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి ఒక ప్రకటనలో తెలిపారు యూజీ నీట్ పరీక్షకు హాజరు అయ్యే విద్యార్థులు హాల్ టికెట్, 1 పాస్పోర్ట్ సైజ్ ఫోటో, 1 పోస్ట్ కార్డ్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డ్, పాన్ కార్డ్ తదితర ఏదేని ఒక గుర్తింపు కార్డును వెంట తీసుకొని రావాలని అన్నారు. అలాగే ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రం లోపలికి అనుమతించరని అన్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని విద్యార్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు మాత్రమే అనుమతించడం జరుగుతుందని విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరియు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2 కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని మొత్తం 883 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష నిర్వహణకు పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులను సమకూర్చడం జరిగిందని ఆర్టీసీ బస్సులను కూడా విద్యార్థులను సమయానికి పరీక్ష కేంద్రాలకు చేర్చేలా ఏర్పాటు చేయడం జరిగిందని, పరీక్ష అధికారుల నియామకం, శిక్షణ పూర్తయిందని విద్యార్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకొని ప్రశాంతంగా పరీక్ష రాయాలని తెలిపారు.



## కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### శిగ వీరస్వామి గౌడ్ ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు



**ప్రభాత సూర్య,ఇబ్రహింపట్నం:** దేశవ్యాప్తంగా జనగణన తో పాటు కుల గణనను చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు శిగ వీరస్వామి గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.ప్రియతమ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారికి ధన్యవాదాలు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వం కుల గణన పేరుతో తప్పుల తడకగా బీసీ గణన చేసి ఇతరులను బీసీ లలో చూపించడం ద్వారా ఇలాంటీ పనులను కేంద్ర ప్రభుత్వం గమనించి తప్పును కులగణనను ఒప్పుకునేది లేదని దేశవ్యాప్తంగా ఏ విధమైన అవకతవకలు లేకుండా కేంద్ర కేబినెట్ కుల గణనకు అంగీకారం తెలపడం హర్షణీయమన్నారు. అయితే ఇప్పటికే జన గణన ఆలస్యమైన నేపథ్యంలో ప్రజలకు సంక్షేమం అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే వీలైనంత తొందరగా జన గణన తో పాటు కుల గణన ప్రక్రియను పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు పెంచాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.

## నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం



**సంస్థాన్ నారాయణపుర్, మే 02( ప్రభాత సూర్య):** దేశవ్యాప్తంగా జనగణన కులగనన చేపట్టిన భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన బిజెపి నాయకులు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపుర్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు సుర్వి రాజు గౌడ్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి విచ్చేసి మాట్లాడుతూ 60 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయలేనటువంటి సహాసోపేతనైన నిర్ణయాన్ని నరేంద్ర మోడీ నేతృత్వంలో జరగడంతో బిజెపి నాయకులు హర్షం వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కులగనన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సంకలు గుద్దుకోవడం నీతిమాలిన రాజకీయాలకు పరాకాష్టమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కల్లి రాజు యాదవ్, జిల్లా కౌన్సిలర్ సభ్యులు దాసోజు వెంకటాచారి, జిల్లా నాయకులు వంగరి రఘు, సాగర్ల లింగయ్య యాదవ్, నందగిరి జగత్, బండమీది కిరణ్,గొల్లూరి యాదగిరి, కట్కూరి వెంకటేష్,బూస శ్రీను, ఉష్కాగల గిరి, వెంకటేష్, నర్రి నరసింహ, బద్దం యాదయ్య, గూడూరు మంజునాథ్ రెడ్డి, చిలువేర్ వెంకటేష్,గుండె మల్లేష్, వెంకటేష్, గణేష్, శ్రీకాంత్,సునీల్, లింగస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## కార్యకర్తకు అండగా ఉంటాం బీఎస్పీ


### బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు గ్యార మల్లేశ్



**సూర్య, ఇబ్రహింపట్నం:** తమ పార్టీ కార్యకర్తకు అండగా ఉంటామని బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు గ్యార మల్లేశ్ పేర్కొన్నారు. నాగన్పల్లికి చెందిన పార్టీ కార్య కర్త యాదగిరి తండ్రి మృతిచెందారు. పార్టీ నేతలు తలో చేయివేసి అండగా నిలిచారు. రూ. 10 వేలను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో చిత్రం కృష్ణ, ప్రహ్లాద్, కుమార్, అంగద్, బాబు, రమణ, శ్యామ్, స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ నారాయణపూర్ మండలాలకు కృష్ణా జలాలు

### శివన్నగూడెం రిజర్వాయర్ నుండి రెండు మండలాలకు కృష్ణ నీటిని తీసుకొచ్చే విధంగా ప్రణాళికలు




**సూర్య,యాదాద్రి :** డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మునుగోడు నియోజకవర్గం లోని లక్ష్మాపురం శివన్న గూడెం రిజర్వాయర్లకు కొనసాగింపుగా నారాయణపూర్, చౌటుప్పల్ మండలాలకు నీరందించడానికి కావలసిన ప్రణాళికలు సాధ్యసాధ్యాల పై రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం సభ్యులు, ఇరిగేషన్ అధికారులతో మునుగోడు లోని క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు గౌరవ మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చౌటుప్పల్ పట్టణం వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న సందర్భంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని జనాభాకు సరిపడా తాగునీరు అందించడంతోపాటు, నారాయణపూర్ చౌటుప్పల్ మండలాల్లోని చెరువులు కుంటలను నింపి భూగర్భ జలాలను రీఛార్జి చేసే విధంగా శివన్న గూడెం రిజర్వాయర్ నుండి నీటిని తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఈ రెండు మండలాలకు నీటిని తీసుకొచ్చే విషయంలో తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం సభ్యుల సలహాలు సూచనలు



# ఇవి తింటే రోగాలు నయమవుతాయో తెలుసా..

నల్ల టమాటాలు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి, ఇవి శరీరంలో వాపును తగ్గించడంలో సహాయపడతాయి. అవి తక్కువ కేలరీలను కలిగి ఉండటం వల్ల బరువు నిర్వహణకు కూడా ఉపయోగపడతాయి. అంతేకాదు, వాటిలోని యాంటీఆక్సిడెంట్లు సూర్యుని యూవీ కిరణాల నుండి చర్మాన్ని రక్షించడం ద్వారా చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. నల్ల టమాటాలు.. వాటి ప్రత్యేకమైన రంగుతో మాత్రమే కాదు. ఆరోగ్యప్రయోజనాల కారణంగా కూడా ఎంతో గుర్తింపును తెచ్చుకున్నాయి. సాధారణ ఎరుపు టమాటాల కంటే ఇవి అధిక మొత్తంలో యాంటీఆక్సిడెంట్లు ఇతర పోషకాలను కలిగి ఉంటాయి. నల్ల టమాటాలు ఆరోగ్యానికి అందించే ఐదు ముఖ్యమైన ప్రయోజనాలను వివరంగా తెలుసుకుందాం. నల్ల టమాటాలు యాంటీఆక్సిడెంట్ల గనిగా పిలవబడతాయి, ముఖ్యంగా ఆంథోసైనిన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ ఇందులో సమృద్ధిగా ఉంటుంది. ఈ ఆంథోసైనిన్‌లు నల్ల టమాటాలకు వాటి గాఢ రంగును అందిస్తాయి మరియు శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను నిరోధించడం ద్వారా క్యాన్సర్, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఈ యాంటీఆక్సిడెంట్లు శరీర కణాలను రక్షించి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. నల్ల టమాటాలలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది, ఇది రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విటమిన్ సి కొలాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది, ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంతో పాటు గాయాలను త్వరగా నయం చేయడానికి సహాయపడుతుంది. రోజువారీ ఆహారంలో నల్ల టమాటాలను చేర్చడం ద్వారా శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడే సామర్థ్యాన్ని పెంచవచ్చు. నల్ల టమాటాలలో లైకోపీన్, పొటాషియం మరియు ఇతర పోషకాలు గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తాయి. లైకోపీన్ రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది, అయితే పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఈ పోషకాలు గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించి, హృదయ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. నల్ల టమాటాలను ఆహారంలో చేర్చడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని సహజంగా కాపాడుకోవచ్చు.నల్ల టమాటాలలో విటమిన్ ఎ మరియు బీటా-కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి, ఇవి కంటి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

# ఈ సమయాల్లో స్నానం చేస్తే ఇబ్బందులు తప్పవు




స్నానం ఎప్పుడు పడితే అప్పుడు చేస్తున్నారా.. అయితే, మీ తప్పు లేకుండానే ఈ ఆరోగ్య సమస్యలన్నీ కొనితెచ్చుకున్నవారవుతారు. ఈ మాట ఎవరో అంటున్నది కాదు. అటు మానసిక శారీరక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక మార్గంలో వెళ్లాలనుకునే వారు కూడా ఈ విషయం తప్పకుండా తెలుసుకుని తీరాలి. స్నానం చేయకూడని సమయంలో చేస్తే ఎన్నో వ్యాధులకు వెల్కం చెప్పినవారవుతారని నిపుణులు చెప్తున్నారు. స్నానం మన ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ఎంతో మేలు చేస్తుంది. అయితే, సాంప్రదాయ విశ్వాసాల ప్రకారం, కొన్ని నిర్దిష్ట సమయాల్లో స్నానం చేయడం ఆరోగ్యానికి, ఆధ్యాత్మిక సమతుల్యతకు హాని కలిగించవచ్చని నమ్ముతారు. ఈ విషయంలో అజాగ్రత్త వహిస్తే శారీరక, ఆధ్యాత్మిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. స్నానం చేయకూడని నాలుగు సమయాల గురించి, అవి ఎందుకు నిషిద్ధమని భావిస్తారో తెలుసుకుందాం. భోజనం చేసిన వెంటనే స్నానం చేయడం సాంప్రదాయ ఆరోగ్య సూత్రాల ప్రకారం నిషేధం. భోజనం తర్వాత, శరీరంలో రక్తప్రసరణ ప్రధానంగా జీర్ణవ్యవస్థ వైపు కేంద్రీకృతమవుతుంది. ఈ సమయంలో స్నానం చేస్తే, రక్తప్రవాహం చర్మం వైపు మళ్లి, జీర్ణక్రియకు అంతరాయం కలిగించవచ్చు. దీనివల్ల అజీర్ణం, గ్యాస్, లేదా ఇతర జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందుకే, భోజనం చేసిన కనీసం ఒక గంట తర్వాత స్నానం చేయడం ఉత్తమం. అర్ధరాత్రి లేదా రాత్రి లోతుగా స్నానం చేయడం కూడా సాంప్రదాయంలో నిషిద్ధమని చెబుతారు. ఈ సమయంలో శరీరం విశ్రాంతి తీసుకునే స్థితిలో ఉంటుంది, మరియు రాత్రి వాతావరణం చల్లగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి తగ్గే ప్రమాదం ఉంది. ఇది జలుబు, గొంతు నొప్పి వంటి సమస్యలకు దారితీయవచ్చు. అంతేకాదు, ఆధ్యాత్మిక దృక్కోణంలో, రాత్రి సమయంలో ప్రతికూల శక్తుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని నమ్ముతారు, ఇది మానసిక సమతుల్యతను దెబ్బతీస్తుంది. జ్వరం, జలుబు లేదా ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నప్పుడు స్నానం చేయడం మానుకోవాలి. ఈ సమయంలో శరీరం బలహీనంగా ఉంటుంది, మరియు చల్లని నీటితో స్నానం చేయడం వల్ల శరీర ఉష్ణోగ్రత మరింత తగ్గి, ఆరోగ్యం మరింత దిగజారే అవకాశం ఉంది. వైద్యుల సలహా మేరకు, అవసరమైతే వెచ్చని నీటితో తేలికపాటి స్పాంజ్ బాత్ చేయడం మంచిది, కానీ పూర్తి స్నానం నివారించడం ఉత్తమం. సూర్యాస్తమయం తర్వాత, ముఖ్యంగా సాయంత్రం లేదా రాత్రి సమయంలో స్నానం చేయడం సాంప్రదాయంలో నిషేధించబడింది. ఈ సమయంలో శరీరం రోజంతా పనిచేసిన తర్వాత విశ్రాంతి మోడ్‌లోకి వెళుతుంది. స్నానం చేయడం వల్ల శరీర సహజ లయ భంగమవుతుంది, ఇది కీళ్ల నొప్పులు, అలసట, లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. అంతేకాదు, సాంప్రదాయ విశ్వాసాల ప్రకారం, సాయంత్రం సమయంలో ప్రతికూల శక్తుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని, ఇది ఆధ్యాత్మిక అసమతుల్యతకు కారణమవుతుందని చెబుతారు.

# మైదా వంటకాలు తెగ తింటున్నారా..?



రిఫైన్డ్ గోధుమ పిండినే మైదా అని పిలుస్తారు. బయట మనం తినే చాలా రకాల ఆహారాల్లో మైదా పిండినే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. గోధుమ పిండిలోని ఫైబర్‌ను పూర్తిగా తొలగించి రీఫైన్ చేసి ఈ మైదా పిండిని తయారు చేస్తారు. అందువల్ల మైదా పిండిలో కార్బొహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. అంతే తప్ప మన ఆరోగ్యానికి ఎలాంటి మేలు లేదని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మైదా తినడం వల్ల లాభం కంటే.. నష్టాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెల్లటి విషంగా మైదాను చెబుతుంటారు నిపుణులు. రీఫైన్డ్ చేసిన గోధుమ పిండిలో పోషకాలు ఉండవు. ముఖ్యంగా ఫైబర్ అసలే ఉండదు. బి విటమిన్లు అయిన థయామిన్, నియాసిన్, ఫోలేట్, ఐరన్, మెగ్నిషియం, జింక్, యాంటీ ఆక్సిడెంట్లు కూడా కోల్పోవాల్సి వస్తుందని చెబుతున్నారు. అంతేకాదు.. ఇందులో గ్లైసీమిక్ ఇండెక్స్ అధికంగా ఉంటుందని చెబుతున్నారు. ఫలితంగా మైదా వంటకాలతో రక్తంలో చక్కెర స్థాయిలు అమాంతం పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మైదాను తరచూ తింటూ ఉండటం వల్ల దీర్ఘకాలంలో షుగర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే షుగర్ ఉన్నవారు మైదాను తింటే షుగర్ మరింత పెరిగి ప్రాణాపాయం సంభవించే పరిస్థితులు ఏర్పడుతాయి. కనుక మైదా మనకు పూర్తిగా హానికరం అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. పిండి పదార్థాలను అధికంగా తీసుకుంటే శరీరంలో ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. దీంతో శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను కణాలు సరిగ్గా గ్రహించలేవు. దీని వల్ల షుగర్ లెవల్స్ పెరుగుతాయి. దీర్ఘకాలంలో ఇది డయాబెటిస్‌కు దారి తీస్తుంది. ముఖ్యంగా బరువు పెరగడంతోపాటు టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఉంటుంది.అలాగే మైదాను తింటే ఆకలి అంత త్వరగా తీరదు. దీంతో ఆహారం మరింతగా తింటారు. దీని వల్ల శరీరం శక్తిని కోల్పోయినట్లు అవుతుంది. నీరసంగా మారుతారు. అలసటగా అనిపిస్తుంది. అలాగే మూడ్ మారుతుంది. ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు. కనుక మైదాకు వీలైనంత దూరంగా ఉంటేనే మంచిదని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.మైదాతో తయారు చేసిన ఆహారాలను తినకుండా మనస్సును డైవర్ట్ చేసుకునే ప్రయత్నం చేయాలి. ఆయా ఆహారాలకు బదులుగా పండ్లు, నట్స్, విత్తనాలను తినాలి. ఇవి ఆకలిని తగ్గించడమే కాదు, పోషకాలను కూడా అందిస్తాయి. శరీర బరువు తగ్గేందుకు, షుగర్ లెవల్స్ అదుపులో ఉండేందుకు

# ఆరోగ్యంగా ఉండాలంటే చక్కెరను కంట్రోల్ చేసుకోవాల్సిందే..



ఈ రోజుల్లో అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. ఊబకాయం నుంచి గుండె జబ్బులు వరకు అన్ని సమస్యలూ చక్కెర మోతాదుతో సంబంధం కలిగి ఉంటాయి. ఔనూ సూచనల ప్రకారం రోజువారీ చక్కెర పరిమితిని పాటించడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రోజుల్లో అధికంగా చక్కెర తీసుకోవడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. చక్కెర తక్కువగా తీసుకుంటే ఊబకాయం, డయాబెటిస్, గుండె సంబంధిత సమస్యలు దూరం కావచ్చు. అందుకే ప్రతిరోజూ ఎంత మోతాదులో చక్కెర తినాలో తెలుసుకోవడం అవసరం.ఔనూ సూచనల ప్రకారం పురుషులు రోజుకు 36 గ్రాముల వరకు అదనపు చక్కెర మాత్రమే తీసుకోవాలి. అంటే దాదాపు 9 టీస్పూన్లు. దీని కంటే ఎక్కువ తింటే శరీరంలో కేలరీలు అధికమవుతాయి. ఇది బరువు పెరగడానికి దారి తీస్తుంది. కొంతకాలం తర్వాత ఇతర ఆరోగ్య సమస్యలు కూడా మొదలవుతాయి.2 నుండి 18 సంవత్సరాల వయసు పిల్లలు రోజుకు 25 గ్రాముల లోపే చక్కెర తినాలని సూచించబడింది. అంటే సుమారుగా 6 టీస్పూన్లు. ఈ వయసులో ఎక్కువగా చక్కెర తీసుకుంటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల వారిలో డయాబెటిస్ ముప్పు పెరుగుతుంది. చిన్నపిల్లలకు తక్కువ చక్కెర తినే అలవాటు పెడితే భవిష్యత్తులో ఆరోగ్యంగా జీవించవచ్చు. 2 సంవత్సరాల లోపు ఉన్న పిల్లలు అదనంగా చక్కెర తీసుకోవడం పూర్తిగా నివారించాలి. ఈ వయసులో శరీరం త్వరగా అభివృద్ధి చెందుతుంది. ఎక్కువ చక్కెర తీసుకుంటే అది శరీరానికి హానికరం. ఈ సమయంలో తీపి ఆహారాల బదులు సహజంగా ఉండే తీపిని ఉన్న పండ్లు ఇవ్వడం మంచిది. చక్కెర ఎక్కువగా తీసుకుంటే శరీరానికి అవసరమైన దాని కన్నా ఎక్కువ కేలరీలు అందుతాయి. ఇది శరీర బరువు పెరగడానికి కారణం అవుతుంది. అలాగే అధిక చక్కెర వల్ల రక్తంలో ట్రైగ్లిసరైడ్స్ స్థాయిలు పెరుగుతాయి. ఇది గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం కలుగజేస్తుంది. గుండె బలహీనపడుతుంది.చక్కెర ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయంలో కొవ్వు పేరుకుపోతుంది. దీని వల్ల ఫ్యాటీ లివర్ అనే వ్యాధి వస్తుంది. ఇది కాలేయ పనితీరుపై ప్రభావం చూపుతుంది.



# ఆసక్తి కలిగిస్తున్న 'బకాసుర రెస్టారెంట్' ఫస్ట్‌లుక్

ప్రముఖ కమెడియన్, నటుడు ప్రవీణ్ త్వరలోనే భకాసుర అనే రెస్టారెంట్‌ను ప్రారంభించబోతున్నారు.. అనే న్యూస్ అందరిలోనూ కాస్త ఆసక్తి కలిగించి వైరల్‌గా మారింది. అయితే ప్రవీణ్ నటుడిగా బిజీగానే ఉన్నాడు కదా.. మరీ వ్యాపారంలోకి ఎందుకు వెళ్లుతున్నాడు అనే సందేహం కూడా అందరిలో కలిగింది. అయితే ఎట్టకేలకు ఇప్పుడు ఈ న్యూస్‌పై ఓ క్లారిటీ వచ్చింది. ప్రవీణ్ ఎటువంటి రెస్టారెంట్‌ను పెట్టడం లేదు.. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం పేరు 'భకాసుర రెస్టారెంట్'. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను చిత్రబృందం శుక్రవారం విడుదల చేసింది. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రవీణ్ పెద్ద గరిటెతో వంట చేస్తుండటం.. ఆ పక్కనే ఇతర పాత్రలు ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నాయి. ఆ పోస్టర్‌లోనే గమనిస్తే వైవా హర్ష, షైనింగ్ ఫణి మరో వైపు విచిత్రంగా సమ్‌థింగ్ స్పెషల్ పాత్రలుగా కనిపిస్తున్నారు. ఎన్నో విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్ ,షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్,ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది.ప్రమోషనల్ భాగంగా ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ " హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో నేటి యువతరంతో పాటు అన్ని వర్గాలు అలరించే అంశాలున్నాయి. ప్రతి సన్నివేశం అందరికి ఎంతో థ్రిల్లను పంచుతుంది. ప్రవీణ్ కెరీర్‌లో గుర్తుండిపోయే సినిమాగా ఇది ఉండబోతుంది. నటుడిగా ఆయనలోని మరో కోణాన్ని ఈ చిత్రంలో చూడబోతున్నారు. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులకు మా చిత్రం తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అన్నారు. ప్రవీణ్, వైవా హర్ష, షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య, ప్రాచీ ఠాకూర్, జబర్ధస్త్ అప్పారావు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి డీఓపీ: బాల సరస్వతి, ఎడిటర్: మార్తండ్.కె.వెంకటేష్, సంగీతం: వికాస్ బడిస, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: వినయ్ కొట్టి, ఆర్ట్ డైరెక్టర్: శ్రీ రాజా సీఆర్ తంగాల, పీఆర్‌ఓ: ఏలూరు శ్రీను, మదూరి మధు, నిర్మాతలు: లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి, దర్శకత్వం: ఎస్‌జే శివ.



# ప్రభాస్ అభిమానులు టెన్షన్ వద్దు..

## గుడ్ న్యూస్ అందించిన నిర్మాత

కల్కి చిత్రం తర్వాత ప్రభాస్ నుండి ఎలాంటి సినిమా రాలేదు. డైరెక్టర్ మారుతి దర్శకత్వం వహిస్తున్న రాజాసాబ్ ప్రస్తుతం చిత్రీకరణ జరుపుకుంటుండగా, ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ప్రభాస్ లిస్ట్‌లో ఇప్పుడు చాలానే సినిమాలు ఉన్నాయి. డైరెక్టర్ హను రాఘవపూడి డైరెక్షన్?లో ఓ ప్రాజెక్ట్ చేస్తుండగా, ఈ ప్రాజెక్ట్ తర్వాత ప్రశాంత్ నీల్ డైరెక్షన్లో సలార్ 2, నాగ్ అశ్విన్ తో కల్కి 2 చేయనున్నాడు. మధ్యలో సందీప్ రెడ్డి వంగా డైరెక్షన్‌లోను ప్రభాస్ ఓ చిత్రం చేయనున్నాడు. స్పిరిట్ అనే టైటిల్‌కి ఈ చిత్రానికి పెట్టారు. సందీప్ రెడ్డి వంగా కొద్ది రోజుల క్రితం యానిమల్ సినిమాతో పాన్ ఇండియా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు 'యానిమల్' మూవీకి సీక్వెల్‌గా 'యానిమల్ పార్క్' తెరకెక్కనుంది. అయితే, ఈ మూవీ తర్వాతే ప్రభాస్ 'స్పిరిట్' వస్తుందని.. దాని వలన స్పిరిట్ మరింత ఆలస్యం కానుందంటూ ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో మూవీ నిర్మాత భూషణ్.. ప్రభాస్ మూవీ షూటింగ్ త్వరలోనే మొదలు కానుందని తెలియజేశారు. 2, 3 నెలల్లోనే ఈ మూవీ షూటింగ్ ప్రారంభం అవుతుందని ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. 2027లో రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. దీంతో ప్రభాస్ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. సందీప్ రెడ్డి వంగా.. ప్రభాస్ తో కలిసి ఓ పవర్ పోలీస్ యాక్షన్ డ్రామాను రూపొందించనున్నారు. ఇందులో ప్రభాస్ పోలీస్ అవతారంలో చాలా పవర్ ఫుల్‌గా కనిపించనున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లాల్సి ఉంది. రాజాసాబ్ తర్వాత ప్రభాస్ స్పిరిట్ సినిమా కాకుండా ప్రశాంత్ వర్మతో చేయబోయే సినిమాలో జాయిన్ అవుతాడని జోరుగా ప్రచారాలు కూడా జరిగాయి. తాజాగా నిర్మాత క్లారిటీతో వీటన్నింటికి చెక్ పడ్డట్టు అయింది. 2027లో స్పిరిట్ సినిమా రిలీజ్ చేస్తామని నిర్మాత భూషన్ కుమార్ ప్రకటనతో ఫ్యాన్స్ మురిసిపోతున్నారు. ప్రస్తుతం ఇటలీలో ఉన్న ప్రభాస్ ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత రాజాసాబ్ మూవీ కంప్లీట్ చేసి ఆ తర్వాత స్పిరిట్ మొదలు పెట్టనున్నట్టు సమాచారం.

# 'హిట్ 3'తో మరో హిట్

సాధారణంగా హీరోయిన్లు వరసపెట్టి సినిమాలు చేస్తుంటారు. కానీ హిట్ కొట్టేవాళ్లు చాలా తక్కువ మంది ఉంటారు. ఇలాంటి వాళ్లతో పోలిస్తే కాస్త భిన్నమైన హీరోయిన్ శ్రీనిధి శెట్టి. చేసింది తక్కువ సినిమాలే అయినా కేజీఎఫ్ ఫ్రాంచైజీతో బ్లాక్ బస్టర్ కొట్టింది. ఇప్పుడు 'హిట్ 3'తో మరోసారి సక్సెస్ అందుకుంది. సరే ఇవన్నీ పక్కనబెడిత ఇంతకీ శ్రీనిధి ఎవరు? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి? ఈమె పూర్తి పేరు శ్రీనిధి రమేశ్ శెట్టి. మంగళూరులో పుట్టి పెరిగిన ఈమె తుళువ కమ్యూనిటీకి చెందిన అమ్మాయి. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివింది. యాక్సెంచర్ కంపెనీలో జాబ్ తెచ్చుకుంది. ఇందులో జాబ్ చేస్తూనే మోడల్ గానూ పనిచేసింది. అలా 2016 మిస్ సూపర్ నేషనల్ అందాల పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ అవార్డ్ గెలిచిన రెండో దక్షిణాది అమ్మాయిగా రికార్డ్ కూడా సృష్టించింది. ఇలా మోడల్ గా చాలా పేరు తెచ్చుకున్న శ్రీనిధి శెట్టి.. ?అనుకోకుండా దర్శకుడు ప్రశాంత్ నీల్ దృష్టిలో పడింది. అలా కేజీఎఫ్ ఫ్రాంచైజీలో ఈమెని హీరోయిన్ గా తీసుకున్నాడు. స్వతహాగా ఇది హీరో సెంట్రిక్ సినిమా అయినప్పటికీ రీనా దేశాయ్ అనే పాత్రలో శ్రీనిధి నటన ఆకట్టుకుంది. అలా ఈమెకు పాన్ ఇండియా ఇమేజ్ వచ్చింది.

కేజీఎఫ్ 2 రిలీజైన కొన్నాళ్లకు తమిళంలో విక్రమ్ సరసన 'కోబ్రా' సినిమా చేసింది. ఇది తెలుగులో ఆడలేదు గానీ తమిళంలో మాత్రం మోస్తరు హిట్ గా నిలిచింది. 2022లో కోబ్రా చేసిన శ్రీనిధి.. దాదాపు మూడేళ్ల తర్వాత తెలుగులోకి 'హిట్ 3'తో పరిచయమైంది. హిట్ 3 కూడా హీరో సెంట్రిక్ యాక్షన్ మూవీ కావడంతో శ్రీనిధి శెట్టికి ఏమంత ప్రాధాన్య ఉండదులే అని చాలామంది అనుకున్నారు. స్టోరీకి అవసరమయ్యే పాత్ర ఈమెకు దక్కడం, మరోవైపు సినిమాకు పాజిటివ్ టాక్ రావడంతో శ్రీనిధి.. సంతోషంతో ఉబ్బితబ్బిబ్బి ?అయిపోయింది. లెక్క ప్రకారం హిట్ 3 ఈమెకు మొదటి తెలుగు సినిమా కాదు. సిద్ధు జొన్నలగడ్డ 'తెలుసు కదా' కోసం ఈమెని హీరోయిన్ గా తీసుకున్నారు. ఈ మూవీ లాంచ్ ఈవెంట్ కి వచ్చిన నాని.. శ్రీనిధిని చూసి హీరోయిన్ ఛాన్స్ ఇచ్చాడు. దీంతో అసలు కంటే ఈ సినిమా ముందొచ్చింది. హిట్ కొట్టేసింది.

మరోవైపు హిందీలో భారీ బడ్జెట్ తో తీస్తున్న 'రామాయణ్'లోనూ శ్రీనిధినే సీతగా ఎంపిక చేశారు. కానీ రావణుడి పాత్ర కోసం యష్ వచ్చేసరికి.. ఈమెకి దక్కిన అవకాశం చేజారిపోయింది. సీత పాత్రలోకి సాయిపల్లవి వచ్చింది. ఏదేమైనా నిదానంగా సినిమాలు చేస్తున్న శ్రీనిధి శెట్టి.. చేసిన ప్రతి మూవీతోనూ హిట్ అందుకోవడం ఇక్కడ విశేషం.





# 'కింగ్డమ్' స్టోరీని రివీల్ చేసిన మొదటి పాట

విజయ్ దేవరకొండ లేటెస్ట్ మూవీ 'కింగ్డమ్'. మే 30న థియేటర్లలోకి రానుంది. కొన్నిరోజుల ముందు వరకు సినిమా వాయిదా పడుతుందని రూమర్స్ వినిపించాయి. కానీ తాజాగా పాటతో ప్రమోషన్స్ తో మొదలుపెట్టడంతో పుకార్లకు చెక్ పడింది. ఇప్పుడు ఆ పాటని రిలీజ్ చేశారు. 'హృదయం లోపల..' అంటూ సాగే ఈ గీతంలో కింగ్డమ్ సినిమా కథేంటి అనేది కొంతలో కొంత రివీల్ చేశారని చెప్పొచ్చు. సూరి అనే రౌడీ, ?అతడితో ప్రేమలో ఉన్న ఓ డాక్టర్.. వీళ్లిద్దరూ కలిసి శ్రీలంక ఆర్మీపై ఏదో ప్లాన్ చేస్తున్నట్లు కనిపించారు. అదేంటి అనేది మాత్రం సినిమా చూసి తెలుసుకోవాలి. కింగ్డమ్ సినిమాలో సూరి అనే పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించాడు. అతడి ప్రేయసిగా భాగ్యశ్రీ బోర్సే నటించింది. ఈ పాటలో ఓవైపు చంపడం చూపిస్తూనే, చివర్లో రొమాన్స్ కూడా చూపించారు. సినిమా కూడా అటు యాక్షన్, ఇటు రొమాన్స్ అనేలా ఉంటుందని హింట్ ఇచ్చారేమో?

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G.
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.